# సూర్య ఉదయం

తెలుగు దిన పత్రిక

ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం



విలేకరులు కావలెను

సూర్య ఉదయం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర పదేశ్ ,తెలంగాణలో అన్ని నియోజకవర్గ, కేంద్రాలలో అసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడునుపూర్తి వివరాలకు సంప్రదించండి.

ఐడి కార్డు ఉచితం

యం.సునీల్ కుమార్

సూర్య ఉదయం తెలుగు దిన పత్రిక ఎడిటర్

సెల్ : 08512 254632



ఎడిటర్ : యం. సునీల్ కుమార్ సంపుటి : 08 సంచిక : 247 శనివారం 29 - 08 - 2026 పేజిలు : 08 వెల రూ. 2 రూ/

Published From Kurnool : Circulated at VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam,Chittoor, Kurnool, Kadapa, Anantapuram, Hyderabad


## అమరావతిలో క్వాంటమ్ యూనివర్సిటీ!

- అమరావతిలో దేశపు తొలి క్వాంటమ్, ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు
- రూ.730.7 కోట్ల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం, కేంద్రం నిధులు
- సెప్టెంబర్ 2026 నుంచి తొలి విద్యా కార్యక్రమాలు ప్రారంభం
- క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ రంగాల్లో కోర్సులు, పరిశోధనలు
- పరిశోధనలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చడమే అసలైన సవాల్
- కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "నేషనల్ క్వాంటమ్ మిషన్"



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరో చారిత్రక మైలురాయిని అందుకోబోతోంది. భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా నిలిచే కీలక ప్రాజెక్టుకు వేదిక కానుంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీలకు అంకితమైన పూర్తిస్థాయి యూనివర్సిటీ క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ పరిణామంపై ఎన్డీటీవీ మీడియా సంస్థ విస్తృతమైన, విశ్లేషణాత్మక కథనం వెలువరించింది. ఈ ప్రాజెక్టు వివరాల్లోకి వెళితే, మొత్తం రూ.730.7 కోట్ల అంచనా వ్యయంతో ఈ యూనివర్సిటీ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తుంది. ఐదేళ్ల కాలానికి అవసరమైన పూర్తి - మిగతా 2 లో

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి



- 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్
- జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ
- మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమన్న లోకేశ్
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు
- వివిధ రంగాలకు చెందిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు

**అమరావతి :**

సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం - మిగతా 2 లో



## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి
- బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును - మిగతా 2 లో



## అమెరికా నుంచి 'ఫైర్ అండ్ ఫర్గెట్' జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

- జావెలిన్ యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్న భారత్
- ఆటోమేటెడ్ గైడెన్స్ మెకానిజంతో పని చేసే జావెలిన్ క్షిపణులు
- భారత సైనిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న అత్యాధునిక క్షిపణులు

**ఢిల్లీ :**

సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి అత్యాధునిక 'ఫైర్ అండ్ ఫర్గెట్' సాంకేతికత కలిగిన 'జావెలిన్' (ఝుజవశ్రీఱఅ) యాంటీ ట్యాంక్ క్షిపణి వ్యవస్థలను కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. భారత సాయుధ దళాల ఆధునికీకరణలో భాగంగా ఈ ప్రతిపాదిత రక్షణ ఒప్పందం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.భుజంపై నుంచి ప్రయోగించే ఈ జావెలిన్ క్షిపణి వ్యవస్థ ఆటోమేటిక్ గైడెన్స్ మెకానిజంతో పనిచేస్తుంది. దీనివల్ల క్షిపణిని ప్రయోగించిన తర్వాత అది టార్గెట్‌ను స్వయంగా గుర్తించి దెబ్బతీస్తుంది. అదే సమయంలో, - మిగతా 2 లో

## నేపాల్‌లో జల ప్రళయం 547కి చేరిన మృతుల సంఖ్య



- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం

**ఢిల్లీ :**

నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో - మిగతా 2 లో

## అంబటి రాంబాబుకు అస్వస్థత




- స్టెంట్ వేసిన వైద్యులు
- అస్వస్థతకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు
- హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స
- ఆందోళన వద్దని స్పష్టం చేసిన వైద్యులు


## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం

- మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!
- అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్
- ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు




## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా
- బ్రిటన్ సైనిక స్థావరాలపై దాడి చేస్తామంటూ సంకేతాలు
- బ్రిటన్, ఫ్రాన్స్ 'నిప్పుతో చెలగాటం' ఆడుతున్నాయని వ్యాఖ్య
- ఉక్రెయిన్‌లో స్టార్మ్ షాడో తయారీకి మార్గం సుగమం



**ఢిల్లీ :**

ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ - మిగతా 2 లో

## అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు




- మంత్రి పొంగులేటి హామీ
- జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం



## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది


- తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత
- సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత
- అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు
- ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్ :**

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల - మిగతా 2 లో

## రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు గట్టిగా వాదించండి

- నీటిపారుదలశాఖ సమీక్షలో సీఎం దిశానిర్దేశం
- అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో వాదించాల్సిన అంశాలపై సమీక్ష
- మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశం



**హైదరాబాద్ :**

అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై ఢిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి, ఇతర రాష్ట్రాల వాదనలేంటి, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఈ విలయం ఎవరి పాపం?

హిమవత్పర్వత శ్రేణి రాళ్లూ రప్పల సమూహం కాదు... అది ప్రకృతి చెక్కిన ఒక అద్భుత దృశ్యకావ్యం. ఈ సౌందర్యం కాస్తా రెప్పపాటులో మృత్యుగీతం ఆలపిస్తుంది. జనావాసాలను క్షణంలో శ్మశాన వాటికలుగా మారుస్తుంది. బుధవారం నేపాల్--టిబెట్ సరిహద్దుల్లో అతి పెద్ద మంచుఖండం విరిగి భోటే కోశీ నదిలో పడటంతో మెరుపు వరదలు సంభవించి 350 మంది వరకూ మరణించారని అంటున్నారు. 30కిపైగా దేశాలకు చెందిన 1,300 మంది గల్లంతయ్యారు. వారిలో 290 మంది భారతీయులు. నది దిగువనవున్న అనేక జనావాసాలు, డజను జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదార్లు కొట్టుకు పోయాయి. హిమాలయాల్లో ఇలాంటి ఉదంతాలు రివాజుగా మారినా, ఈసారి ఉత్పాతం అతి పెద్దదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ దారుణానికి కారణమేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రిక్టర్ స్కేల్‌పై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించటంవల్లే ఇలా జరిగిందని తొలుత వార్తలొచ్చాయి. అయితే దాన్ని నిర్ధారించే ఉపగ్రహ చిత్రాలేమీ లేకపోవటంతో తీవ్ర వాతావరణ స్థితిగతులవల్లే మంచుఖండం కరిగి విరిగిపడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగటంవల్ల భూమి నానాటికీ వేడెక్కుతోంది. కాలుష్యకారక దేశాల్లో తొలి స్థానం అమెరికాది. అటు తర్వాత స్థానం చైనాది కాగా, మూడో స్థానం మనది. నాలుగో స్థానం యూరోప్ దేశాలది. కర్బన ఉద్గారాల విడుదలలో నేపాల్ స్థానం 95. అంటే ప్రపంచాన విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో ఒక శాతంలో పదో వంతు వాటా మాత్రమే నేపాల్‌ది. వాతావరణ మార్పుల తాకిడికి నష్టపోయే దేశాల్లో మాత్రం ఆ దేశానిది ఆరో స్థానం. అతి తక్కువ కాలుష్యానికి కారణమవుతూ అతి ఎక్కువ మూల్యం చెల్లిస్తున్న దేశంగా నేపాల్‌ను చెబుతారు. ఇప్పుడంటే సూపర్ ఎల్‌నినో వచ్చిపడిందిగానీ... గత దశాబ్దకాలంగా ప్రకృతి వైపరీత్యాలు వేధిస్తూనే ఉన్నాయి. వాటిని ముందుగా పసిగట్టే సాంకేతికతలు అనుకున్నంతగా అభివృద్ధి చెందకపోయినా, గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన ఉపకరణాలు అమెరికా, చైనాలవద్ద ఉన్నాయి. తమ కారణంగా యేటా భారీ నష్టాన్ని చవిచూస్తున్న నేపాల్‌కు ఆ సాంకేతికతల్ని ఉచితంగా ఇచ్చి ఆదుకోవటం తమ నైతిక ధర్మమని అవి రెండూ అనుకోవు. ఫలితంగా చెప్పాపెట్టకుండా మెరుపు వరదలు విరుచుకుపడటం నేపాల్‌లో మామూలు విషయంగా మారింది.భోటే కోశి నది టిబెట్‌లో మొదలవుతుంది. కొడారి దగ్గర ఒక పాయ, రసువా దగ్గర మరో పాయ నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. నిరుడు సైతం ఆ నదికి ఇలాగే వరదలొచ్చాయి. గత నెల 8న రసువా దగ్గరొచ్చిన వరదల్లో 18 మంది చనిపోగా, అనేక జలవిద్యుత్ ప్రాజె క్టులు, వంతెనలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. వర్షపాతం, వరదనీటి ప్రవాహాల గురించిన డేటా చైనా ఎప్పటికప్పుడు అందిస్తే ప్రాణనష్టాన్ని నివారించే వీలుంటుంది. దేశంలోకి వరద నీరు ప్రవేశించటం మొదలయ్యాకే పౌరుల్ని హెచ్చరించే స్థితి ఉండటం నేపాల్‌కి విషాదం మిగులుస్తోంది. కొన్నిసార్లు మంచుపలకలు విరిగి భోటే కోశి ప్రవాహ మార్గాన్ని కప్పేస్తాయి. అప్పుడు దిగువన నేపాల్‌లో నది నిండుకుంటుంది. దాన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకుంటారు. ఇలాంటి వైపరీత్యాలు జరిగినప్పుడు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం తప్పదు. నిరుడు బేత్రావతి--రసువాగడి కారిడార్‌ను వరదలు ముంచెత్తి భారీ నష్టం జరిగింది.అతి కష్టంపై వాటన్నిటినీ పునర్నిర్మించారు. అవన్నీ తాజా వరదల్లో మళ్లీ కొట్టుకు పోయాయి. పదిపదిహేనేళ్ల డేటా అందుబాటులో ఉండి అధ్యయనం చేయగలిగితే నది నడత అంచనాకు, దానికి అనుగుణంగా కనిష్ఠ స్థాయి నష్టం మాత్రమే ఉండేలా నిర్మాణాలు చేపట్టడానికి కొంతవరకూ వీలవుతుంది. భారీ జననష్టం, ఆస్తినష్టం కలగజేసే వైపరీత్య సమాచారం సైతం సరిహద్దుల ఆవలే నిలిచిపోతే మానవాళి సాధించిన అభివృద్ధికి అర్థం ఉండదు. దానికన్నా ముందు సంపన్న దేశాలు తమ అభివృద్ధి నమూనాలను మార్చుకోవాలి. వైపరీత్యం వచ్చిపడ్డాక సాయం చేయటానికి ముందుకు రావటం మెచ్చదగిందే అయినా, దాని నివారణకు తమ వంతు చేయాల్సిందేమిటో అవి గుర్తెరగాలి. బాధ్యతారహిత ప్రవర్తన ఏదో ఒకరోజు తమను కూడా ధ్వంసించగలదని తెలుసుకోవాలి.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

**మొదటిపేజీ తరువాయి -** ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.


## అమెరికా నుంచి 'ఫైర్ అండ్ ఫర్గెట్' జావెలిన్ క్షిపణుల కొనుగోలుకు భారత్ మొగ్గు

**మొదటిపేజీ తరువాయి -** క్షిపణి ప్రయోగించిన సైనికుడు శత్రువుల దాడి నుంచి తప్పించుకోవడానికి లేదా సురక్షిత ప్రాంతంలో తలదాచుకోవడానికి తగిన సమయం లభిస్తుంది.ఎత్తైన పర్వత ప్రాంతాలు, సరిహద్దు వద్ద శత్రుదేశాల ట్యాంకులు, సాయుధ వాహనాలను సమర్థవంతంగా అడ్డుకోవడానికి ఈ జావెలిన్ క్షిపణులు అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తాయి. భారత సరిహద్దుల్లో రక్షణను మరింత కట్టుదిట్టం చేసేందుకు అమెరికాతో జరుగుతున్న ఈ రక్షణ ఒప్పందం భారత్ సైనిక రంగానికి సాంకేతికంగా పెద్ద ఊతాన్ని ఇవ్వనుంది.

## అంబటి రాంబాబుకు అస్వస్థత

**మొదటిపేజీ తరువాయి -** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్



**మొదటిపేజీ తరువాయి -** సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది.రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు.ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది.బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య



**మొదటిపేజీ తరువాయి -** వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకు న్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది.ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## అమరావతిలో క్వాంటమ్ యూనివర్సిటీ!

**మొదటిపేజీ తరువాయి -** నిధులను కేంద్ర ప్రభుత్వమే గ్రాంట్ల రూపంలో సమకూర్చడం ఈ ప్రాజెక్టు యొక్క ప్రత్యేకత. అమరావతిలో 8.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక క్యాంపస్‌ను నిర్మించనున్నారు.కేవలం విద్యకే పరిమితం కాకుండా విద్య, పరిశోధన, సెమీకండక్టర్ టెక్నాలజీ, స్టార్టప్‌ల ప్రోత్సాహం, అధునాతన నైపుణ్యాల కల్పన వంటి బహుళ లక్ష్యాలతో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "నేషనల్ క్వాంటమ్ మిషన్", "ఇండియా ఏఐ మిషన్", "ఇండియా సెమీకండక్టర్ మిషన్" వంటి కీలక కార్యక్రమాలకు అనుగుణంగా ఈ యూనివర్సిటీ పనిచేస్తుంది. పరిశోధనలను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చేందుకు ఒక కీలక కేంద్రంగా (హబ్) దీనిని తీర్చిదిద్దనున్నారు.ఈ క్యాంపస్‌లో సుమారు 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ క్వాంటమ్ రీసెర్చ్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ బ్లాక్‌ను నిర్మించనున్నారు. ఇందులో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెక్యూరిటీ, క్వాంటమ్ ఫోటోనిక్స్, క్రయోజెనిక్ సిస్టమ్స్, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్లీన్‌రూమ్‌లు, నానో-ఫ్యాబ్రికేషన్, సెమీకండక్టర్/చిప్-డిజైన్ ల్యాబ్‌లు, డేటా సెంటర్లు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక స్పేస్ వంటి ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఉంటాయి.ఇక్కడ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్, డిప్లొమా, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లను అందించనున్నారు. ముఖ్యంగా క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, సెమీకండక్టర్ అసెంబ్లీ & టెస్టింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్ వంటి అత్యంత కీలకమైన సబ్జెక్టుల్లో కోర్సులు అందుబాటులో ఉంటాయి.ఈ ప్రాజెక్టును వేగంగా పట్టాలెక్కిం చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 సెప్టెంబర్ నుంచే మొదటి విద్యా కార్యక్రమాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అమరావతిలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రం నుంచి తరగతులు, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి ఐదేళ్లలో సుమారు 8,250 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో 1,650 మంది డిగ్రీ కోర్సుల ద్వారా, 6,600 మంది స్కిల్లింగ్/సర్టిఫికేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారు. ఐదో సంవత్సరం నాటికి ఏటా సుమారు 3,913 మంది విద్యార్థులను చేర్చుకునే స్థాయికి ఈ సంస్థ చేరుకుంటుంది. క్యాంపస్‌లో 500 పడకల నివాస సదుపాయం, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, సోలార్ పవర్, ఈవీ ఛార్జింగ్ వంటి పర్యావరణ హిత సౌకర్యాలు కూడా ఉంటాయి.ఈ ప్రాజెక్టుతో అమరావతి చుట్టూ ఒక టెక్ ఎకోసిస్టమ్‌ను నిర్మించి, దానిని 'క్వాంటమ్ వ్యాలీ'గా మార్చాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆకాంక్షలకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 2026 ఫిబ్రవరిలోనే ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఐఐటీ తిరుపతి, ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రణాళికలు రచిస్తోంది.అయితే, ఇలాంటి పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయడం ముఖ్యం అయినప్పటికీ, పరిశోధనలను ఆచరణాత్మక, వాణిజ్య నైపుణ్యాలుగా మార్చడమే అసలైన సవాల్ అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశీయంగా మేధో సంపత్తిని, సార్వభౌమ సాంకేతికతను సృష్టించాలంటే ఈ యూనివర్సిటీని పరిశ్రమలు, ఫ్యాబ్స్, డిజైన్ హౌస్‌లు, స్టార్టప్‌లతో బలంగా అనుసంధానించడం కీలకమని వారు సూచిస్తున్నారు. ఏదేమైనా, ఈ యూనివర్సిటీ ఏర్పాటు భారతదేశ సాంకేతిక ప్రస్థానంలో, ముఖ్యంగా అమరావతి అభివృద్ధిలో ఒక సువర్ణాధ్యాయమని చెప్పవచ్చు.

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి



జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే)సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు).కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

## వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది



**మొదటిపేజీ తరువాయి -** కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు.వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు.మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు.శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

## తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం



**మొదటిపేజీ తరువాయి -** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది.సాధారణంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు" అని ఆయన ప్రస్తావించారు.దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

సూర్య ఉదయం
తెలుగు దిన పత్రిక
శనివారం 29 - 08 - 2026

## నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రాలయం జనసేన ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న



**ఆగస్టు 28 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా (క్యాబినెట్ హోదా) ప్రమాణ స్వీకారం చేసిన మీాజ కొణిదల నాగబాబుకు మంత్రాలయం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వాల్మీకి బి లక్ష్మన్న మంగళగిరిలో శుభాకాంక్షలు తెలిపారు.మంగళగిరిలోని అరణ్య భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నాగబాబును నేరుగా కలిసిన లక్ష్మన్న, ఆయనకు పూలమాలలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులతో నాగబాబు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు వాల్మీకి లక్ష్మన్న పేర్కొన్నారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గం లో స్థానిక ఎన్నికలపై. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలాపేతంపై మాట్లాడినట్లు సమాచారం

## కోసిగిలో అంబరాన్నంటిన సంబరాలు

**నయన మనోహరం..**

**వైభవంగా శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవం!**






**కోసిగి ఆగస్టు 28 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** మండల కేంద్రమైన కోసిగిలోని కడపాళెం, సిద్ధప్ప పాళెం కాలనీలలో వెలసిన తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం కులబాంధవుల మధ్య కమనీయంగా సాగింది. శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా సాంప్రదాయబద్ధంగా ఈ జ్యోతి మహోత్సవాలను నిర్వహించారు.వేకువజామున అమ్మవారి ఇంటి వద్ద ఆలయ అర్చకులు గోవిందు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు ఓంప్రకాష్, డీసీ నారాయణల ఆధ్వర్యంలో కులబాంధవులు అమ్మవారి జ్యోతులను వెలిగించి, అక్కడి నుంచి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కలశాలతో ఊరేగింపుగా బయలుదేరారు. భక్తులు అమ్మవారి జ్యోతులను మోస్తూ, భక్తి పాటలు పాడుతూ, భజనలు చేస్తూ ముందుకు సాగారు. యువకులు అమ్మవారి ఖడ్గాలు విన్యాసాలు చేస్తూ "ఖోబలే.. ఖోబలే" అంటూ సాగిన ఊరేగింపు అలరించింది.అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి, చిన్నపాటి బలులు.సమర్పించారు. అలాగే నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని ఆ దేవతను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు బావిగడ్డ వెంకటేష్, హాల్వి వీరేష్, డాక్టర్ గోపాల్, రంగస్వామి, ముండాసం ఈరన్న, తోవి రామకృష్ణ, రాము, బండారు శ్రీనివాసులు, కులబాంధవులు మరియు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## మేకల ఓంప్రకాష్‌కు ఘన సత్కారం

**కోసిగి మండల తోగట వీరక్షత్రీయ మాజీ మండల అధ్యక్షుడు**

**శ్రీ మేకల ఓంప్రకాష్ కి కులబాంధవులు ఘనంగా సన్మానం**





**ఆగస్టు 28 (సూర్య ఉదయం ప్రతినిధి మంత్రాలయం) :** సొంత పనులు రిత్యా ఇటీవల ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో తోగట వీరక్షత్రీయ కులబాంధవుల సమక్షంలో ఈ వేడుకను వైభవంగా నిర్వహిం చారు.. గత 30 సంవత్సరాలు గా మేకల ఓంప్రకాష్ మండలాధ్యక్షుడిగా కొనసా గుతూ, సమాజ అభ్యున్నతికి మరియు ఆలయాభివృద్ధికి విశేష కృషి చేశారని సభ్యులు కొనియాడారు. చౌడేశ్వరి దేవి ఆలయ ప్రగతికి ఆయన అందించిన సేవలు మరవరానివని, ఆయన మార్గదర్శకత్వం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పదవికి రాజీనామా చేసినప్పటికీ, రాబోయే రోజుల్లో ఆయన ఇచ్చే అమూల్యమైన సలహాలు, సూచనలతోనే సంఘాన్ని మరియు ఆలయాభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని కులబాంధవులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తోగట వీరక్షత్రీయ సంఘం ప్రతినిధులు, ప్రముఖులు, కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓంప్రకాష్ ని శాలువాలు, పూలమాలలతో సత్కరించి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

## నీట్-పీజీ అభ్యర్థులకు ట్రాఫిక్ జాయింట్ సీపీ సూచనలు

**- హైదరాబాద్ మారథాన్ కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ**

**- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సూచన**

**సూర్య ఉదయం ప్రతినిధి, సైబరాబాద్:** హైదరాబాద్‌లో ఈ నెల 30వ తేదీ ఆదివారం ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్-2026 నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు మారథాన్ కొనసాగనుంది. దీంతో సైబరాబాద్ పరిధిలోని పలు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అదే రోజు నీట్-పీజీ ప్రవేశ పరీక్ష కూడా ఉండటంతో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. మారథాన్ జరిగే మార్గాల్లో ప్రయాణించకుండా వీలైనంత వరకు ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని కోరారు. కేబుల్ బ్రిడ్జి, ఐటీసీ కోహినూర్, మైహోమ్ అబ్రా, ఐకియా, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, ×××ు జంక్షన్, గచ్చిబౌలి స్టేడియం ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. అలాగే హైటెక్స్, ఎన్ఏసీ మెయిన్ గేట్, మెటల్ చార్మినార్, టెక్ మహీంద్రా, రైడర్గ్ మెట్రో స్టేషన్, ఐకియా అండర్‌పాస్ ప్రాంతాల్లో కూడా రద్దీ ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిటీ-పీజీ అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఆలస్యం కాకుండా కనీసం ఒకటి నుంచి రెండు గంటల ముందుగానే బయలుదేరాలని సూచించారు. ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని జాయింట్ ట్రాఫిక్ సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. నిట్-పీజీ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ జాయింట్ ట్రాఫిక్ సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రాఖీ బంధం.. ఆత్మీయతకు ప్రతీక

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాఖీలు కట్టిన మహిళలు**









**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సబిహా, శేరిలింగంపల్లి సీనియర్ నాయకురాలు బొబ్బా నవతా రెడ్డి, స్థానిక సీనియర్ నాయకురాలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి రాఖీ పౌర్ణమి ప్రతీక అని అన్నారు. కష్టసుఖాల్లో తోడుగా, అండగా ఉంటాననే భరోసాను రాఖీ బంధం కల్పిస్తుందని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆడపడుచులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మహిళలందరికీ తన ఆశీస్సులు అందజేస్తూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా పోరాటాల స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ బిజీ మాదన్న

**సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య వ్యాఖ్య**

**ఘనంగా బిజీ మాదన్న 9వ వర్ధంతి వేడుకలు**



**సూర్య ఉదయం ప్రతినిధి (ఆగస్టు 28 )ఎమ్మిగనూరు:**-భూ పోరాటాలు, పేద ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అమరజీవి కామ్రేడ్ బిజీ మాదన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. బిజీ మాదన్న 9వ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్ లోని ఆయన చిత్రపటానికి, కే. తిమ్మాపురం గ్రామంలోని ఆయన స్థూపానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ మండల కార్యదర్శి రాజీవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ...ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాల్లో భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు రక్షణ కవచంగా నిలిచిన ఘనత బిజీ మాదన్నకే దక్కుతుందన్నారు.పేదల భూములు, గుడిసెల పట్టాలు, ఉపాధి, సాగునీరు మరియు కార్మికుల హక్కుల కోసం ఆయన నిరంతరం ఉద్యమించారని గుర్తుచేశారు.కలగట్ల సమీపంలోని కొండమ్మ చెరువు నిర్మాణం కోసం ఆయన 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి సాధించారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి బిజీ మాదన్న చూపిన పోరాట మార్గమే నేటి యువతకు, కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధన కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. రంగన్న, భాస్కర్ యాదవ్, విరుపాక్షి, మద్దిలేటి నాయుడు, సోమేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు బీటీ చిన్నన్న, నాగప్ప, దాదావలి, బజారి, వెంకటేష్, తిమ్మాపురం గ్రామ ప్రజలు, రైతు మరియు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: బండి రమేష్**






**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌కు మహిళలు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. పార్టీలకు అతీతంగా మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా అండగా నిలుస్తానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని బండి రమేష్ హామీ ఇచ్చారు. రాఖీలు కట్టిన మహిళలను ఆత్మీయంగా ఆశీర్వదించిన ఆయన.. కుటుంబంతో పాటు సమాజం, రాజకీయాలు, విద్య, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సోదర ప్రేమానుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి-మాధవరం రంగారావు





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సోదరీమణులతో రాఖీలు కట్టించుకున్నారు. వివేకానంద నగర్ డివిజన్, కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన సోదరీమణులతో పాటు మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి, కలిదిండి రోజా తదితరులు ఆయనకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ స్థానిక సోదరీమణులు ఆత్మీయంగా రాఖీలు కట్టి సోదర ప్రేమాభిమానాలను చాటుకున్నారని అన్నారు. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సోదరీమణుల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటాయని రంగారావు తెలిపారు. అదే విధంగా సోదరీమణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ప్రేమాభిమానాలు, సోదరభావం వెల్లివిరియాలని మాధవరం రంగారావు ఆకాంక్షించారు.

## రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక- వడ్డేపల్లి రాజేశ్వరరావు





**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు రక్షాబంధన్ పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, నియోజకవర్గంలోని పలువురు అక్కాచెల్లెళ్లు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ సోదరీమణులందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు, ఆప్యాయతలు తనకు ఎల్లప్పుడూ కొండంత బలాన్ని ఇస్తాయని ఆయన అన్నారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో వారి సహకారం, ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని, ప్రతి ఇంటా ఆనందం, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న కుమారి నందమూరి మోహన రూప



**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కుమారి నందమూరి మోహన రూప తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అట్లూరి దీపక్ నివాసానికి విచ్చేసి రాఖీ కట్టారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి కూడా రాఖీలు కట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ పండుగ విశిష్టతను గుర్తుచేసుకుంటూ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారంతా పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి రవి, ఆర్ కె చౌదరి, విక్రమ్ సింహ, సాయి, రమాదేవి, శ్రీదేవి, స్నేహ, శశి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభిమానానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కృతజ్ఞతలు





**సూర్య ఉదయం ప్రతినిధి, కుత్బుల్లాపూర్:** రాఖీ పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ - మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్లకు నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. షాపూర్‌నగర్‌లోని కూన శ్రీశైలం గౌడ్ నివాసానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు చూపిన ఆప్యాయతకు శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు చూపుతున్న అభిమానం, ఆప్యాయత తనకు ఎప్పటికీ ప్రత్యేకమైనవని ఆయన అన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు ప్రతి ఒక్కరూ గౌరవం, మర్యాద ఇవ్వాలని, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పద్మ, లావణ్య, శ్యామల, సంగీత, అనితతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్య ఉదయం
ప్రతి పదం... ప్రజా శ్రేయస్కరం
తెలుగు దిన పత్రిక
శనివారం 29 - 08 - 2026

# జర్నలిస్టు అవార్డుల పేర్లు మార్చిన ఏపీ ప్రభుత్వం కొత్త పేర్లు ఇవే!

**జర్నలిస్టు అవార్డుల పేర్లను సవరిస్తూ ఏపీ సర్కార్ ఉత్తర్వులు**

**కొన్ని పేర్లపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం**

**ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డుకు సావిత్రిబాయి పూలే పేరు ఖరారు**

**ఉత్తమ ఫొటో జర్నలిస్టు, గ్రామీణ జర్నలిస్టు అవార్డుల పేర్లు కూడా మార్పు**

**కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు పేరుతో ఉత్తమ జర్నలిస్టు అవార్డు**



ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు అందించే పలు పురస్కారాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో నిర్ణయించిన కొన్ని అవార్డుల పేర్లపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఆ మేరకు నిన్న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల ద్వారా పలువురు ప్రముఖుల పేర్లను ఈ పురస్కారాలకు జత చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన అవార్డుల వివరాలు ఇలా ఉన్నాయి: బి. నాగేశ్వరరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు పేరును "కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు"గా మార్చారు. ఎం.ఏ. రహీమ్ ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు స్థానంలో "కొక్కు అహోబలరావు ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డు" అని పేరు మార్పు చేశారు. ఖాసా సుబ్బారావు, ఎం. నర్సింగరావు, షోయబుల్లా ఖాన్ ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డుల పేర్లను "ఖాసా సుబ్బారావు, ముట్నూరి కృష్ణారావు, మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు"గా సవరించారు.ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డుకు ప్రముఖ సంఘ సంస్కర్త "సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు"గా నామకరణం చేశారు. ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు పేరును "అబ్దుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు"గా మారుస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఇకపై ఈ నూతన పేర్లతోనే పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

# బ్యాగులో బంగారం, నగదు, ఆస్తిపత్రాలు తిరుమలలో పోగొట్టుకున్న బ్యాగు భక్తులకు తిరిగి అప్పగింత

**తిరుమల ఘాట్ రోడ్డులో భక్తులు పోగొట్టుకున్న బ్యాగ్‌ను అప్పగించిన టీటీడీ**

**ఒక బైకర్ చొరవతో భద్రతా సిబ్బందికి చేరిన విలువైన బ్యాగ్**

**బ్యాగులో రూ.2 లక్షల నగదు, 61 గ్రాముల బంగారం, ఆస్తి పత్రాలు**

**పూర్తి ఆధారాలు పరిశీలించిన తర్వాతే యజమానులకు అందజేత**



టీటీడీ సిబ్బంది, బైకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల టీటీడీ సిబ్బంది మరోసారి తమ నిజాయతీని, సేవాభావాన్ని చాటుకున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో గుంటూరుకు చెందిన ఓ కుటుంబం పోగొట్టుకున్న లక్షల రూపాయల విలువైన నగలు, నగదు ఉన్న బ్యాగును భద్రంగా వారికి అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. మానవత్వం, బాధ్యత కలగలిసి ఓ భక్తుల కుటుంబంలో ఆనందం నింపిన ఈ ఘటన తిరుమలలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా బ్రాడీపేటకు చెందిన పోతుల నారాయణ, సునీత దంపతులు తమ కుటుంబంతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తిరుపతి నుంచి తిరుమల వచ్చే రెండో ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా, తమ బ్యాగును ఎక్కడో జారవిడుచుకున్నారు. ఆ బ్యాగులో 61 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,02,840 నగదుతో పాటు సుమారు రూ.10 లక్షల విలువైన భూమి ఒప్పంద పత్రాలు ఉన్నాయి.ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఘాట్ రోడ్డుపై వెళుతున్న ఓ బైకర్ ఆ బ్యాగును గమనించారు. వెంటనే దాన్ని తీసుకుని, ఉదయం 6:30 గంటలకు జీఎన్సీ టోల్‌గేట్ వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు రెడ్డప్పరావుకు అప్పగించారు. సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది ఆ బ్యాగును కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి భద్రపరిచారు.మరోవైపు, బ్యాగ్ పోయిందని గుర్తించిన భక్తుల కుటుంబం ఆందోళనతో వెతుకుతూ టీటీడీ అధికారులను సంప్రదించింది. వారు చెప్పిన వివరాలు, అందించిన గుర్తింపు ఆధారాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ ఆదేశాల మేరకు, ఏవీఎస్వోలు కృష్ణయ్య, వెంకట శివకుమార్‌ల సమక్షంలో బ్యాగును తెరిపించి, అందులోని వస్తువులను యజమానులతో సరిచూయించారు. నగదు, బంగారం, విలువైన పత్రాలు అన్నీ సురక్షితంగా ఉన్నాయని భక్తులు నిర్ధారించుకున్నారు.అనంతరం అధికారులు ఆ బ్యాగును వారికి సురక్షితంగా అప్పగించారు. పోయిందనుకున్న తమ విలువైన వస్తువులు తిరిగి దక్కడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కష్టకాలంలో బాధ్యతగా వ్యవహరించి బ్యాగును అప్పగించిన బైకర్‌కు, సమయస్ఫూర్తితో దానిని భద్రపరిచి తమకు అందజేసిన టీటీడీ భద్రతా సిబ్బందికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం- సీఎం చంద్రబాబు

**ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్**

**ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం**

**అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన**

**రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి**



రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు.ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పీ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు- సీఎం చంద్రబాబు


**టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు**

**రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం**

**పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక**



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు.పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు.సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు.గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019-24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కోరమాండల్ కిసాన్ మాల్‌లో బిల్లింగ్ లేని వ్యాపారం?

**పట్టించుకోని వ్యవసాయ అధికారి**

**షరతులతో వ్యాపారం చేస్తే సహించం: సీపీఐ ప్రధాన కార్యదర్శి జగదీశ్**




**కౌతాళం ఆగస్టు 29(సూర్యఉదయం):–** కౌతాళం మండలంలోని కోరమాండల్ కిసాన్ మాల్‌లో రైతులతో ప్రైవేట్ దుకాణాల తరహాలో వ్యవహరిస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి జగదీశ్ ఆరోపించారు.రైతులకు అవసరమైన ఎరువులు అడిగినప్పుడు,వాటితో పాటు గుళికలు, పొటాష్ తదితరాలను తప్పనిసరిగా అంటగడుతున్నారని ఆయన తెలిపారు.అదేవిధంగా రైతులతో బిల్లింగ్ లేకుండా వ్యాపారం జరుగుతున్నా వ్యవసాయ అధికారి పట్టించుకోవడం లేదని జగదీశ్ విమర్శించారు.వ్యవసాయ అధికారి ఉన్నట్లా,లేనట్లా వ్యవహరిస్తున్నారని ఆయన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.రైతులకు పంపిణీ చేయాల్సిన గ్రౌండ్‌నట్ కిట్లు ఎవరికి ఇచ్చారనే సమాచారం కూడా ఇప్పటివరకు వెల్లడించలేదని జగదీశ్ అన్నారు.రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై వ్యవసాయ అధికారి స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని జగదీశ్ హెచ్చరించారు.అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు."రైతులపై షరతులు విధించి వ్యాపారం చేస్తే సహించేది లేదు.అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి" అని జగదీశ్ డిమాండ్ చేశారు.

# సోదర ప్రేమానుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి







**సూర్య ఉదయం ప్రతినిధి, కూకట్‌పల్లి:** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌లోని సూర్య ఉదయం దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా నివాసంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహించిన ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు ఆత్మీయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోదరి మెహ్రూక్ తన తమ్ముళ్లు షారిఖ్ ఇక్బాల్, షఫీక్‌లకు ఆత్మీయంగా రాఖీలు కట్టి సోదర ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సూర్య ఉదయం తెలంగాణ ఎడిటర్ బాషా మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సోదరీమణుల ప్రేమాభిమానాలు, ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ కొండంత అండగా ఉంటాయని తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రేమ, సోదరభావం, ఐక్యతను చాటే పర్వదినంగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని పేర్కొన్నారు.

# రిటైర్డ్ రెవెన్యూ అటెండర్ దర్జీ నరసన్న ఆకస్మిక మృతి

**టీడీపీ నేతలు కదిరి కోట షాలేం రాజు, ఎం. ఏసేపు నివాళులు**

**- బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి**




**సూర్య ఉదయం ప్రతినిధి ఆగస్టు 28 ) ఎమ్మిగనూరు:–** ఎమ్మిగనూరు పట్టణం ఎస్సీ కాలనీ, 7వ వార్డు శాంతినగర్ కు చెందిన రిటైర్డ్ రెవెన్యూ అటెండర్ దర్జీ నరసన్న ఆకస్మికంగా మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మంచి వ్యక్తిగా, అందరితో కలివిడిగా ఉండే నరసన్న మృతి పట్ల కాలనీ వాసులు, బంధుమిత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు కదిరి కోట షాలేం రాజు మరియు ఎం. ఏసేపు వెంటనే ఆయన నివాసానికి చేరుకున్నారు. భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. నరసన్న లేని లోటు తీరనిదని, ఆయన కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ నివాళి కార్యక్రమంలో కె.శాంతి రాజు,ఎం.సంసోను, ఏలీషా, అనీల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ టీడీపీ- 90 లక్షల ఇళ్ల మైలురాయిని దాటిన కార్యక్రమం

**33వ రోజూ విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం'**

**ఇప్పటివరకు మొత్తం 90.55 లక్షల కుటుంబాలను సందర్శించిన శ్రేణులు**

**ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తూ,**




తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఇప్పటివరకు 90 లక్షలకు పైగా కుటుంబాలను సందర్శించి, ప్రభుత్వ పనితీరుపై ఫీడ్‌బ్యాక్ సేకరించాయి. శుక్రవారంతో ఈ కార్యక్రమం 33వ రోజుకు చేరుకుంది.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని టీడీపీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా 2,07,428 ఇళ్లను సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సందర్శించిన మొత్తం ఇళ్ల సంఖ్య 90.55 లక్షలకు చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తున్నాయి. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. అదే సమయంలో, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను నేరుగా నమోదు చేసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోందని టీడీపీ నేతలు చెబుతున్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములవుతున్నట్లు వారు పేర్కొన్నారు.

# అమరావతికి 'వాటర్ వే' కృష్ణా నదిలో జలమార్గం ద్వారా సామగ్రి తరలింపు

**కృష్ణా నదిలో జలమార్గం ద్వారా అమరావతికి సామగ్రి తరలింపు**

**సామగ్రి రవాణాలో సమస్యలకు చెక్ పెడుతున్న జలమార్గం**

**ఎన్టీఆర్ జిల్లాలో ఫెర్రీ రేవు నుంచి సామగ్రి తరలింపు**

వేల కోట్ల రూపాయల ఖర్చు శరవేగంగా సాగుతున్న పనులు ఇలా రాజధాని అమరావతి అభివృద్ధిలో దూసుకుపోతుంది. ఈ నిర్మాణ పనులకు కావాల్సినంత సామగ్రి సమయానికి రోడ్డు మార్గం ద్వారా అందించగలమా అంటే అనుమానమే అయితే కృష్ణా నదిలో అందుబాటులో వచ్చిన జలమార్గం సరకు రవాణాలో ఎదురయ్యే కష్టాలకు చెక్ పెడుతోంది. అసలేంటీ జలమార్గం ఎక్కడ నుంచి ఎక్కడి వరకు ఉంది సామగ్రిని ఎలా తరలిస్తున్నారుట.కృష్ణా నదిలో జలమార్గం ద్వారా అమరావతికి సామగ్రి తరలింపు 514 టన్నుల భారీ బార్జ్ : రాజధానిలో పనులు జెట్ స్పీడ్‌లో సాగుతున్నాయి. మౌలిక వసతుల నిర్మాణానికి భారీ మొత్తంలో సామగ్రిని వినియోగిస్తున్నారు. గ్రావెల్, మెటల్, క్రషర్ డస్ట్, సిమెంట్ లాంటి వాటిని నిర్మాణ ప్రదేశాలకు సకాలంలో తరలించాలి. దీంతో రోడ్డుతో



పాటు జలమార్గాన్ని వినియోగిస్తున్నారు. కృష్ణా నదిలోని జాతీయ జలమార్గం-4 ద్వారా సామగ్రిని రాజధానికి చేరవేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద ఫెర్రీ రేవు నుంచి 514 టన్నుల భారీ బార్జ్ ద్వారా కృష్ణా నదిలో సరకు రవాణా చేస్తున్నారు.ఈ బార్జ్‌లో ఇరవై టిప్పర్ల సరకు రవాణా చేసే అవకాశం ఉంది. ఫెర్రీ నుంచి ఉద్ధండరాయనిపాలెం, తాళ్లాయపాలెం గ్రామాల సామగ్రిని తీసుకెళు_న్నారు. అక్కడి నుంచి టిప్పర్లు ఆయా నిర్మాణ ప్రదేశాలకు వెళు_న్నాయి. ఈ జలమార్గం వల్ల డీజిల్ ఖర్చులు, ట్రాఫిక్ జాం ఇబ్బందులు తప్పుతున్నాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."ఒక ట్రిప్ వెళ్లేందుకు 40 నిమిషాలు పడుతుంది. వచ్చేటప్పుడైతే వాహనాలు ఖాళీగా ఉంటాయి కాబట్టి 25 నిమిషాల్లో వచ్చేస్తాం. జలమార్గంలో వాహనంతో పాటు సరకు, సిబ్బందికీ ఎలాంటి ప్రమాదం ఉండదు. ఒక రోజులో 3 ట్రిప్పులు వేస్తాం. రోడ్డుపై వెళ్తే గంట, గంటన్నర పడుతుంది. టోల్‌గేట్ దగ్గర ట్రాఫిక్ ఉంటే రెండు గంటలు కూడా పట్టొచ్చు. దీంతో చాలా ఆలస్యం అవుతుంది. అమరావతికి వెళ్లి అన్‌లోడ్ చేసి మళ్లీ తిరిగొస్తాం.గ్రావెల్‌ను తీసుకెళ్తున్నా. ఎంత సమయం పడుతుందంటే నలభై నిమిషాలని చెప్పారు. రోడ్డుపై వెళ్తే 2-3 గంటలు పడుతుంది. ఇక్కడ సురక్షితంగానే అనిపిస్తోంది. ఈ వాహనం చాలా సురక్షితంగా ఉంది". వాహనాల డ్రైవర్లు అమరావతి నిర్మాణంలో ఈ జలమార్గం మరింత విస్తృత సేవలు అందించనుంది. భవిష్యత్?లో సమర్థవంతమైన, ఆర్థిక, పర్యావరణహిత ప్రత్యామ్నాయ రవాణా సాధనంగా మారనుంది.

# పోలీసు బాస్‌ల గొంతులతో బెదిరింపులు

**వ్యాపారుల నుంచి లక్షలు లాగిన ఘరానా కేటుగాడు**

**తెనాలిలో ఘరానా మోసం స్నేహితుడిలా నటించి వ్యాపారికి వల**

**అప్పు అడిగితే కాళ్లు, చేతులు నరికేస్తానంటూ బెదిరింపులు**

**ఎస్పీ, డీఎస్పీల గొంతులను అనుకరిస్తూ లక్షల వసూలు**

వ్యాపారులతో పరిచయం పెంచుకున్నాడు. ప్రాణ స్నేహితుడిలా నటించి నమ్మించాడు. తీరా అప్పు తీసుకున్నాక అసలు రంగు బయటపెట్టాడు. డబ్బులు అడిగితే కాళ్లు, చేతులు నరికేస్తానంటూ బెదిరించాడు. అంతటితో ఆగక ఏకంగా ఎస్పీ, డీఎస్పీ లాంటి పోలీస్ ఉన్నతాధికారుల పేర్లు, వారి గొంతులతో ఫోన్లు చేసి వ్యాపారులను భయపెట్టాడు. రక్షించాల్సిన పోలీసుల పేర్లతోనే మోసాలకు పాల్పడుతున్న ఈ కేటుగాడి గుట్టును తెనాలి పోలీసులు రట్టు చేశారు. తమదైన వ్యూహంతో కిలాడీ ఆట కట్టించారు.గుంటూరు జిల్లా తెనాలిలోని గంగానమ్మపేట రోడ్డులో రవికుమార్, విజయ్ యాదవ్ పాన్ బ్రోకర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరికి నూతలపాటి రత్నబాబు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. రత్నబాబు గతంలో పలుమార్లు వీరి వద్ద బంగారం, వెండి వస్తువులను తాకట్టు పెట్టేవాడు. ఆ తర్వాత డబ్బులు చెల్లించి నమ్మకంగా వాటిని విడిపించుకునేవాడు. ఇలా వ్యాపారుల నమ్మకాన్ని చూరగొన్నాడు. అయితే, వ్యాపారి రవికుమార్ వద్ద ఉన్న డబ్బు, ఆస్తి చూసిన రత్నబాబుకు దురాశ పుట్టింది. ఎలాగైనా అతని వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు లాగాలని పక్కా స్కెచ్ వేశాడు.పోలీసు బాస్‌ల గొంతులతో బెదిరింపులు - వ్యాపారుల నుంచి లక్షలు లాగిన ఘరానా కేటుగాడు గొంతులు మార్చి ప్రణాళికలో భాగంగా రవికుమార్ వద్ద రత్నబాబు అప్పు తీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత డబ్బులు తిరిగివ్వాలని వ్యాపారి అడగగా, రత్నబాబు తన అసలు స్వరూపం బయటపెట్టాడు. డబ్బులు ఇవ్వకపోగా ఎదురుతిరిగాడు. కాళ్లు, చేతులు నరికేస్తానని, చంపేస్తానని బెదిరించాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వ్యాపారి అనగా, తనకు ఉన్నతస్థాయి అధికారులు తెలుసంటూ బుకాయించాడు. ఆ తర్వాత వేరే నంబర్ల నుంచి ఏకంగా జిల్లా ఎస్పీ, తెనాలి డీఎస్పీ, సీఐ మాట్లాడుతున్నానంటూ గొంతులు మార్చి ఫోన్లు చేశాడు. 'మీ వ్యాపారాల్లో లొసుగులున్నాయి. అంతుచూస్తాం' అంటూ బెదిరింపులకు దిగాడు. ఈ బెదిరింపులకు భయపడిపోయిన బాధితుడు, ఫోన్‌పే ద్వారా, నగదు రూపంలో విడతల వారీగా ఏకంగా రూ. 6.80 లక్షలు నిందితుడికి సమర్పించుకున్నాడు.ఖాకీల ఎంట్రీతో సీన్ రివర్స్ రోజురోజుకూ బెదిరింపులు పెరిగిపోవడం, పోలీసుల గొంతులతోనే బెదిరింపులకు పాల్పడుతుండటంతో వ్యాపారి రవికుమార్‌కు అనుమానం వచ్చింది. ఈ వ్యవహారంపై విసుగు చెందిన ఆయన, చివరకు తనకు తెలిసిన దపోలీసులకు అసలు విషయం చెప్పాడు. బాధితుడి ఫిర్యాదుతో తెనాలి టూ టౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేపట్టారు. నిందితుడు నూతలపాటి రత్నబాబును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 40 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.హైటెక్ వసూళ్లకు ఎండ్ కార్డ్ క్రైం సినిమాలు చూసి స్ఫూర్తి పొందాడో లేక, మిమిక్రి షోల నుంచి నేర్చుకున్నాడో గాని, పోలీసు అధికారుల పేరుతో మాట్లాడి అతను బెదిరించిన తీరు చూసి పోలీసులే విస్మయం చెందారు. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి వసూళ్లకు పాల్పడటంపై తీవ్రంగా పరిగణించారు. తెనాలి పట్టణంలో కలకలం రేపిన ఈ హైటెక్



వసూళ్ల పర్వానికి రత్నబాబు అరెస్టుతో ఎండ్ కార్డ్ పడింది. ఈ తరహా మోసాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి ఆటకట్టించిన సీఐ రవీంద్రబాబు, ఎస్సై లలిత్ కుమార్, సిబ్బంది బాబురావు, గణేశ్, నాగరాజులను డీఎస్పీ జనార్దనరావు అభినందించారు."నిందితుడు రత్నబాబు పోలీసు అధికారుల పేరుతో మాట్లాడి బెదిరింపులకు పాల్పడేవాడు. జిల్లా ఎస్పీగా, తెనాలి డీఎస్పీగా, సీఐగా తన గొంతును మార్చి, ఫోన్లలో మాట్లాడుతూ వ్యాపారులకు దడ పుట్టించాడు. అందుకే ఈ వ్యవహారాన్ని మేం సీరియస్?గా తీసుకున్నాం. వ్యక్తిగతంగా బెదిరించటమే కాకుండా, ఉన్నతాధికారుల పేర్లు వాడుకోవడంతో ప్రత్యేక దృష్టి సారించాం. పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. ఇలాంటి బెదిరింపులకు ఎవరు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.డి.రవీంద్రబాబు, తెనాలి టూటౌన్ సీఐ

# రాఖీకి 5 వేల 'స్పెషల్' బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు

**రాఖీ పౌర్ణమి సందర్భంగా 5000 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్న టీజీఎస్ ఆర్టీసీ**

**ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు**

**మహిళలకు యథావిధిగా మహాలక్ష్మి పథకం కొనసాగుతుందన్న అధికారులు**

రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 5000 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. గత ఏడాదితో పోల్చితే ఈసారి అదనంగా మరో 240 బస్సులను నడిపిస్తున్నామని స్పష్టం చేసింది. ప్రత్యేక బస్సుల్లో ఒకటిన్నర శాతం ఛార్జీలు అదనంగా వసూలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి ఉచిత రవాణా సదుపాయాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నామని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది.5 వేల ప్రత్యేక బస్సులు రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులు రద్దీగా మారిపోయాయి. ప్రధాన ప్రయాణ ప్రాంగణాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, దిల్ సుఖ్ నగర్, ఎస్సార్?నగర్ వంటి ప్రాంతాల నుంచి వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 5 వేల ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం



ప్రకటించింది. గత ఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా 4,760 ప్రత్యేక బస్సులు నడపగా, ఈసారి మరో 240 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. గత ఏడాది ప్రత్యేక బస్సుల్లో సుమారు 3.68 కోట్ల మంది ప్రయాణించగా, వారిలో 2.51 కోట్ల మంది మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు.టైమ్‌కు బస్సు రాదాయే ఇదిలా ఉండగా ఈ ప్రత్యేక బస్సులు సైతం ప్రయాణికుల అవసరాలకు సరిపోవడం లేదు. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. బస్సులు తక్కువ, ప్రయాణికులు ఎక్కువ ఉండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్టాండ్లలో ఎదురు చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. సొంతూళ్లకు వెళ్లే ఆడపడుచులు ప్రధాన బస్టాండ్లలో బస్సుల కోసం ఎదురు చూడడం కనిపించింది. దీంతో కొంతమంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాఖీ పండుగ సందర్భంగా నడిపించే ప్రత్యేక బస్సుల్లో ఒకటిన్నర శాతం ఛార్జీలు పెంచడం పట్ల ప్రయాణికులు మండిపడుతున్నారు. సాధారణ ఛార్జీలనే వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలి రాఖీ పౌర్ణమి, ఆ తర్వాత శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో పండుగకు ముందుగానే ప్రయాణికుల రద్దీ మొదలవుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తిరుగు ప్రయాణాల రద్దీ ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం వరకు కొనసాగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా బస్సులు నడిపించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట అదనపు బస్సులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.మహిళలకు యథావిధిగా ఉచిత ప్రయాణాలు మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. పండుగ రద్దీ సమయంలో ఆర్టీసీ సిబ్బంది సమష్టిగా, ఓర్పుతో విధులు నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. రాఖీ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా టీజీఎస్ ఆర్టీసీ అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను వినియోగించుకుని సురక్షితంగా ప్రయాణించాలని ఆయన సూచించారు.

# ఏడీ జయరాజు అరెస్టు ఆయన నివాసాల్లో రూ.100 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ

**భూపాలపల్లి, హైదరాబాద్‌లోని ఏడీ జయరాజు ఇళ్లల్లో ఏసీబీ సోదాలు**

**ఏడీ జయరాజు నివాసాల్లో సుమారు రూ.100 కోట్ల ఆస్తులు గుర్తింపు**

**భూపాలపల్లి జిల్లా భూగర్భగనులశాఖ ఏడీ జయరాజు అరెస్టు**

**ఏడీ జయరాజ్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు**

**ఏడీ జయరాజ్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు**

హైదరాబాద్ బోడుప్పల్?లో కోట్ల రూపాయల విలువ చేసే రెండస్తుల భవనం కీసర సహా 5 చోట్ల ఓపెన్ ప్లాట్లు, సోదాల్లో రూ.10 లక్షలు, బ్యాంకు నిల్వ రూ.71 లక్షలు ఇలా చెప్పుకుంటూ పోతే అక్రమాస్తులు విలువ వంద కోట్లకు పైమాటే. ఇవన్నీ భూపాలపల్లి జిల్లాలోని మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న జయరాజు అక్రమాస్తుల చిట్టా. వరుసగా అవనీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జయరాజుపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు ఏక కాలంలో 8 చోట్ల సోదాలు నిర్వహించి సుమారు రూ.100 కోట్ల అక్రమాస్తులు గుర్తించారు. సదరు అధికారి ఇటీవల జిల్లాలోనే ఉత్తమ అధికారిగా అవార్డు పొందటం గమనార్హం.8 ప్రాంతాల్లో ఏక కాలంలో దాడులు : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మైన్స్ అండ్ జియాలజీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం వరంగల్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్ నిర్వహిస్తున్న బొజ్జ జయరాజుపై వరంగల్ రేంజ్ ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. గత కొన్ని నెలలుగా ఆయన స్థిర చరాస్తులపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు ఈ రోజు తెల్లవారుజాము నుంచి హైదరాబాద్, వరంగల్, సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల్లో సోదాలు చేసింది. అనిశా జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ ఆధ్వర్యంలో సోదాలు చేసిన అధికారులు హైదరాబాద్ బోడుప్పల్?లోని అయన నివాసం, బంధువులు ఇళ్లు, సూర్యాపేట, తుంగతుర్తి లోని బంధువుల ఇళ్లు, అతని డ్రైవర్ నివాసం సహా మొత్తం 8 ప్రాంతాల్లో ఏక కాలంలో అనిశా అధికారులు సోదాలు నిర్వహించారు.సోదాల్లో భాగంగా ఏసీబీ అధికారులు జయరాజుకు చెందిన భారీగా అక్రమాస్తులు గుర్తించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో మూడంస్థుల భవనం, హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో అపార్ట్మెంట్ ఫ్లాట్, హైదరాబాద్ కీసరలో రెండు ఓపెన్ ప్లాట్లు, తుంగతుర్తి, తూప్రాన్, సూర్యాపేటలో ఒక్కో ప్లాట్?ను ఏసీబీ గుర్తించింది. సూర్యాపేటలో 3.21 ఎకరాల వ్యవసాయ భూమి, బోడుప్పల్ ఆయన నివాసంలో సోదాల సమయంలో రూ.10 లక్షల నగదు, ఎల్ఐసీ, మ్యాక్స్ సేవింగ్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో పాటు మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.20 లక్షల పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్, 629 గ్రాముల బంగారు ఆభరణాలు సోదాల్లో గుర్తించింది. రూ.10 లక్షల విలువ చేసే గృహోపకరణాలు, మొత్తం మూడు బ్యాంకు



ఖాతాల్లోని రూ.71.27 లక్షల నిల్వ గుర్తించారు.రూ.100 కోట్ల ఆస్తులు గుర్తింపు : అంతే కాకుండా సోదాలు, ప్రాథమిక విచారణ సమయంలో జైరాజు డ్రైవర్ సత్తునూరి యాదయ్య మొబైల్ ఫోన్‌లో కీలక సమాచారాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి నిందిత అధికారి కుమార్తె బ్యాంకు ఖాతాకు పలు లావాదేవీల ద్వారా సుమారు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై విచారించగా ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తుల నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేసి తన ఖాతాకు పంపి వాటిని తిరిగి కుమార్తె ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ తెలిపాడు. ఏడీ జయరాజు ఇళ్లల్లో జరిగిన ఏసీబీ సోదాల్లో రూ.100 కోట్ల ఆస్తులను గుర్తించారు. కాగా జైరాజు అరెస్ట్ చేసిన ఏసీబీ హైదరాబాద్ తరలించనున్నారు. విచారణ అనంతరం రిమాండ్?కు తరలించే అవకాశం ఉంది.

# కల్వర్టు అనుమతికి లంచం.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఇరిగేషన్ ఈఈ, డీఈ, ఏఈ

**నెల్లూరులో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ముగ్గురు ఇరిగేషన్ అధికారులు**

**కల్వర్టు అనుమతి కోసం రైతు నుంచి రూ. 3 లక్షలు స్వీకరిస్తుండగా పట్టివేత**

**రూ. 4 లక్షలు డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు**

నెల్లూరు జిల్లాలో ముగ్గురు నీటిపారుదల శాఖ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక రైతు నుంచి రూ. 3 లక్షలు లంచం స్వీకరిస్తుండగా ఈఈ మహేశ్, డీఈ గౌతమ్ సుమన్, ఏఈ నారాయణరాజులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకు_న్నారు.వివరాల్లోకి వెళితే.. కలువాయి మండలం మద్దూరుపల్లి గ్రామానికి చెందిన రైతు అంబటి చిరంజీవి, తన పొలం వద్ద గల కాలువపై కల్వర్టు నిర్మించుకునేందుకు అనుమతి (ఎన్‌ఓసీ) కోసం నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించారు. అయితే, ఆ ఎన్‌ఓసీ జారీ చేసేందుకు సదరు అధికారులు రూ. 4 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు.దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి వ్యూహం ప్రకారం, గురువారం బాధితుడి నుంచి రూ. 3 లక్షలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి ముగ్గురు అధికారులను పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్న అధికారులు తదుపరి విచారణ చేపట్టారు. ఈ ఘటన జిల్లా నీటిపారుదల శాఖలో తీవ్ర కలకలం రేపింది.

# టీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం బస్సుల్లో ఇకపై 'సెల్ఫ్ టికెటింగ్

**టీఎస్ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సుల్లో 'సెల్ఫ్ టికెటింగ్' విధానం**

**క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు**

**నల్గొండ-హైదరాబాద్ మార్గంలో ప్రయోగాత్మకంగా ప్రారంభం**

**చిల్లర సమస్యకు పరిష్కారం, ప్రయాణ సమయం ఆదా**

**స్మార్ట్‌ఫోన్ లేనివారు డ్రైవర్ వద్ద టికెట్ పొందే వెసులుబాటు**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల సౌకర్యార్థం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాన్‌స్టాప్ బస్సు సర్వీసుల్లో 'సెల్ఫ్ టికెటింగ్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. బస్సు ఎక్కే ముందు టికెట్ కోసం వేచి చూసే అవసరం లేకుండా, ప్రయాణికులే స్వయంగా టికెట్ కొనుగోలు చేసేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించింది.ఈ విధానంలో భాగంగా ప్రయాణికులు బస్సు ఎక్కే ముందు డోర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను తమ స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. అనంతరం తాము ఎక్కే, దిగే స్టాప్‌ల వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించగానే టికెట్ జనరేట్ అవుతుంది. ఆ డిజిటల్ టికెట్‌ను డ్రైవర్‌కు చూపిస్తే సరిపోతుంది.ప్రయోగాత్మకంగా ఈ స్మార్ట్ టికెట్ విధానాన్ని తొలుత నల్గొండ-హైదరాబాద్ మార్గంలో అమలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ రూట్‌లో ప్రస్తుతం 45 డీలక్స్ నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ఇక్కడ ఈ విధానం విజయవంతమైతే, సెప్టెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని మిగతా అన్ని నాన్‌స్టాప్ రూట్లలోనూ విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు.ఈ కొత్త విధానం వల్ల ప్రయాణికులకు చిల్లర సమస్య తీరడంతో పాటు సమయం ఆదా అవుతుందని ఆర్టీసీ భావిస్తోంది. అదే సమయంలో డ్రైవర్లపై టికెట్లు జారీ చేసే పనిభారం కూడా తగ్గుతుంది. అయితే, స్మార్ట్‌ఫోన్‌లు లేనివారు, డిజిటల్ చెల్లింపులపై అవగాహన లేని ప్రయాణికులు యథావిధిగా డ్రైవర్ వద్దే టికెట్ కొనుగోలు చేయవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ సెల్ఫ్ టికెటింగ్ విధానం కోసం 'మీ సేవ'కు చెందిన 'మీ టికెట్'తో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

# షాద్‌నగర్‌లో కన్నీటి దృశ్యం సోదరుడికి కడసారి రాఖీ

**షాద్‌నగర్‌లో విద్యుదాఘాతంతో యువకుడి మృతి**

**మృతి చెందిన సోదరుడికి కన్నీటితో కడసారి రాఖీ కట్టిన సోదరి**

**మృతుడు జమల్లాపూర్ నవీన్‌గా గుర్తింపు**

**మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్‌తో ప్రమాదం**

**రాఖీ పండుగకు ముందు ఘటనతో విషాదంలో కుటుంబం**



తెలంగాణలోని షాద్‌నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాఖీ పండుగ సమీపిస్తున్న వేళ, ఓ సోదరుడు విద్యుదాఘాతంతో మరణించగా, అతని సోదరి నిర్జీవంగా పడి ఉన్న తమ్ముడికి కన్నీటితో రాఖీ కట్టింది. ఈ హృదయ విదారక దృశ్యం అక్కడున్న కుటుంబ సభ్యులు, బంధువులను శోకసంద్రంలో ముంచెత్తింది.వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్‌లోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన జమల్లాపూర్ నవీన్ (24) బుధవారం విద్యుదాఘాతంతో మరణించాడు. చాతనపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఒక దుకాణంలో ఎలక్ట్రికల్ వైర్‌కు మరమ్మతులు చేస్తుండగా, అతను ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో ఈ దుర్ఘటన జరిగింది.రెండు రోజుల్లో రాఖీ పండుగ ఉండటంతో సోదరుడి ఆకస్మిక మరణం అతని సోదరి పూజితను తీవ్రంగా కలచివేసింది. తమ మధ్య ఉన్న అన్నాచెల్లెళ్ల బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆమె తన సోదరుడి మృతదేహానికి చివరిసారిగా రాఖీ కట్టి కన్నీటి వీడ్కోలు పలికింది. ఈ ఘటనతో నవీన్ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## ఏపీలో ఓటర్ల వివరాల్లో లోపాలపై కొనసాగుతున్న విచారణ



రాష్ట్రంలో 'సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్లు వారి ఎన్యూమరేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయంటూ 43.71 లక్షల మందికి ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరిలో 16.23 లక్షల మంది విచారణ గురువారం సాయంత్రానికి పూర్తైంది. వారిలో 8764 మంది తగిన పత్రాలు సమర్పించకపోవడంతో అనర్హులుగా తేల్చారు. 13,63,250 మందిని తుదిజాబితాలో కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మిగతా 2,51,760 మంది ఓటర్లకు సంబంధించి వారు సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది.నోటీసులు అందుకున్న మరో 27.47 లక్షల మంది ఓటర్లను ఇంకా విచారించాల్సి ఉంది. సెప్టెంబర్ 28వ తేదీలోగా ఈ విచారణ పూర్తికావాలి. అప్పుడే నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంతమంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై స్పష్టత వస్తుంది. అయితే నోటీసులు అందుకున్న ఓటర్లకు తహసీల్దార్ కార్యాలయాల వద్దకు విచారణకు రావాలని బీఎల్‌వోలు చెబుతున్నారు. దీంతో వారంతా పనులు మానుకుని అక్కడ పడిగాపులు కాస్తున్నారు. నోటీసులకు స్పందనగా ఏయే పత్రాలు సమర్పించాలనే దానిపై ఓటర్లకు సరైన అవగాహన ఉండట్లేదు. బీఎల్‌వోలూ సరిగ్గా సహకరించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత జాబితాలోని ఓటర్లు 2002 నాటి జాబితాలోని తమ పేరు లేదా తల్లిదండ్రుల పేర్లు లేదా తాత, నాన్నమ్మల పేర్లు, వివరాలతో మ్యాచింగ్ చేసుకోవాలి. బీఎల్‌వోలకు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు లోపాలు, తప్పిదాలతో కూడిన వివరాలతో మ్యాచింగ్ చేసుకున్నారు. ఇలాంటి వారు మొత్తం 44.23 లక్షల మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు గుర్తించారు. దీంతో వీరందరికీ నోటీసులు సిద్ధం చేశారు. వారిలో 43.71 లక్షల మందికి ఇప్పటివరకూ నోటీసుల పంపిణీ పూర్తయింది. నోటీసులు అందుకున్న వారిలో 36 లక్షల మంది తప్పిదాలు, లోపాలతో మ్యాచింగ్ చేసుకున్నవారే.ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటర్ పేర్కొన్న వివరాల్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య వయసు తేడా 15 సంవత్సరాల కంటే తక్కువ, 50 ఏళ్ల కంటే ఎక్కువ, ఓటరు-తాత లేదా నానమ్మల మధ్య వయసు తేడా 40 సంవత్సరాల కంటే తక్కువ వంటి లోపాలున్నాయి.ప్రస్తుత జాబితాలోని ఓటర్ తండ్రి పేరు, 2002 నాటి జాబితాలోని ఓటర్ తండ్రి పేరులో తేడా, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయసు తేడా 9 నెలల కంటే తక్కువగా ఉండటం వంటి తప్పిదాలున్నాయి.ప్రస్తుత జాబితాలోని ఓటర్ పేరు, 2002 నాటి జాబితాలోని ఓటర్ పేర్లలో తేడా, సమర్పించిన తల్లిదండ్రుల వివరాల్లో తప్పులున్నాయి. ఇలాంటి వారికి ఇప్పుడు నోటీసులిచ్చి విచారణకు పిలుస్తున్నారు.

# తల్లికి ప్రేమను చాటే అద్భుత బహుమతులు మదర్స్ డేకుబెస్ట్ గిఫ్ట్ ఐడియాలు ఇవే



ఈ ప్రపంచంలో తల్లి ప్రేమకు మించింది మనిషికి ఏదీ లేదు. ఏ తల్లి అయినా తన బిడ్డ భవిష్యత్ బాగా ఉండాలని కోరుకుంటుంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో మదర్స్ డే జరగనుంది. ఈ మదర్స్ డే రోజున తమ తల్లులకు మరుపురాని బహుమతులు ఇవ్వాలని చాలా మంది అనుకుంటారు. ఈ నేపథ్యంలో మదర్స్ డే రోజు తల్లులకు గిఫ్ట్ ఇవ్వడానికి బెస్ట్ గిఫ్ట్ ఐడియాల గురించి ఓ సారి తెలుసుకుందాం. అమెరికా, భారతదేశం, కెనడా, యూరప్‌లోని ఎక్కువ భాగంతో సహా అనేక దేశాల్లో మే 11, 2025 ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం మే నెలలో రెండో ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈ రోజును పురస్కరించుకుని పిల్లలకు తమ తల్లులకు మంచి బహుమతులు ఇస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు బడ్జెట్ ఫ్రెండ్లీ బహుమతులతోనే అమ్మను సంతోష పెట్టే బహుమతుల కోసం ఎక్కువగా ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ది బెస్ట్ 5 గిఫ్ట్ ఐడియాలపై ఓ లుక్కేద్దాం.

**డిజిటల్ ఫోటో ఫ్రేమ్**

మనకు తల్లితో ఉన్న అనుబంధాన్ని ఇప్పటికే చాలా వరకు ఫోటోల్లో నిక్షిప్తం చేసుకుంటూ ఉంటాం. ఈ అన్ని ఫోటోలను కలిపి డిజిటల్ ఫ్రేమ్‌గా లేదా షేర్డ్ ఆన్‌లైన్ ఆల్బమ్‌గా తయారు చేయండి. భౌతిక ఫోటోల మాదిరిగా కాకుండా ఈ ఆన్‌లైన్ ఆల్బమ్ ఆమెతో గడిపిన సంతోష సమయాన్ని గుర్తు చేస్తూంటుంది.

**పూలుజి**

మీరు మీ తల్లికి దూరంగా ఉంటే ఆమె ఉండే ప్రాంతానికి సమీపంలోని పూల వ్యాపారులు లేదా ఆన్‌లైన్ సేవల ద్వారా అదే రోజు డెలివరీ అయ్యేలా ఆమెకు ఇష్టమైన పూలతో బొకే పంపితే సర్ప్రైజింగ్ గిఫ్ట్‌లా ఉంటుంది. ఇండోర్ ప్లాంట్ లేదా ఆమెకు ఇష్టమైన రంగు పూలను ఇవ్వడం ద్వారా సంతోషపెట్టవచ్చు.

**మొబైల్ ఛార్జింగ్‌కి ఎంత విద్యుత్ ఖర్చు అవుతుందో మీకు తెలుసా..?**

**ఈ-కార్ట్ గిఫ్ట్**

ఆమెకు ఇష్టమైన వస్తువులను అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సైట్స్‌లో ఆర్డర్ చేసి వాటితో పాటు ఈ-గిఫ్ట్ కార్డుతో ఆమె శుభాకాంక్షలు తెలపవచ్చు. లేదా ఆమె ఇష్టమైన భోజన డెలివరీ లేదా దుస్తుల యాప్ కోసం వోచర్‌లను వెంటనే ఈ-మెయిల్ చేయడం ద్వారా ఆమెకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకునేలా చేయవచ్చు.

**వీడియో మెసేజ్**

మీ తల్లి మీకు ఎంత స్పెషల్? ఆవిడంటే మీకు ఎంత ఇష్టం అనే విషయాలను చెబుతూ ఓ లెటర్ రాసి ఆమెకు ఇవ్వడంతో పాటు వీడియో సందేశాన్ని ఆమెకు చూపండి. ఎందుకంటే గిఫ్ట్ షాప్స్‌లో దొరికే లెటర్స్ కంటే స్వ దస్తూరితో రాసిన లెటర్‌ను ఆమెకు అపూరమైనదిగా ఉంటుంది.

**తల్లితో సమయం గడపడం**

మదర్స్ డే రోజు మొత్తం మీ సమయాన్ని మొత్తం ఆమెకే కేటాయించండి. అది ఆమెకు మరుపురాని బహుమతిగా ఉంటుంది. ఆమెతో కలిసి సినిమా చూడటం, వాకింగ్‌కు వెళ్లడం లేదా టీ లేదా కాఫీ తాగుతూ సమయం గడపాలి. ఆమెను పని చేయనివ్వకుండా ఆ రోజు పని మొత్తం మీరే చేయడానికి ప్రయత్నించడం ఉత్తమం.

# రోజుకు ఎంత 'వంట నూనె' వాడాలో తెలుసా

**నిపుణులు ఏమంటున్నారంటే!**

**వంట నూనెను అధికంగా వినియోగిస్తున్న ప్రజలు , తగ్గించకపోతే ప్రమాదం తప్పదట!**



మన వంటకాల్లో నూనె వాడకం ఎక్కువే. బ్రేక్ ఫాస్ట్ మొదలుకుని లంచ్, స్నాక్స్, డిన్నర్‌లో చేసుకునే పదార్థాలకు వంటనూనెను తప్పనిసరిగా వినియోగిస్తున్నాం. అంతేకాదు, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నూనె ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ, అతిగా నూనె వినియోగిస్తే ఆరోగ్యానికి ఎంత మాత్రమూ మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో రోజుకు ఎంత నూనె వాడాలి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం!

**ఎంత నూనె వాడాలి :** మారిన జీవనశైలి కారణంగా ఇంట్లో నూనె వాడకం విపరీతంగా పెరిగిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఒక్కో మనిషి ఏడాదికి సగటున 23.5 లీటర్ల వంటనూనె వాడుతున్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.సిఫార్సుల ప్రకారం మనిషికి రోజుకు 20 మిల్లీ లీటర్లు.. అంటే నాలుగు టేబుల్ స్పూన్లు మించకుండా చూసుకోవాలి. నలుగురు సభ్యులున్న కుటుంబం నెలకు గరిష్ఠంగా 4 లీటర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మించకూడదు. కనిష్ఠంగా 2.5 లీటర్లకు తగ్గకూడదు.వంటల్లో నూనె వాడకపోవటం సాధ్యం కాదు. చేపలు, కొవ్వులో కరిగే ఎ,డి, ఈ, కె వంటి విటమిన్లను శరీరం గ్రహించుకోవటానికి నూనె అవసరం. శారీరక శ్రమకు కావాల్సిన శక్తిని నూనె అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వంటల్లో నూనె ఎక్కువగా వాడితే రక్తనాళాలల్లో పూడికలు ఏర్పడే ప్రమాదముందని అంటున్నారు. ఒబెసిటీ, అధిక రక్తపోటు, గుండెజబ్బులకూ దారితీస్తుందట. అందుకే ఆచితూచి లెక్క కట్టి వాడాలి. రోజువారీ వంట నూనె తీసుకోవడం అనేది హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ముడిపడి ఉంటుంది.

**పదే పదే మరిగిస్తే :** ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వాడకూడదంటున్నారు నిపుణులు. పొంగుతున్న, రంగు మారిన నూనెను అస్సలు ఉపయోగించవద్దని చెబుతున్నారు. రోడ్డుపక్క బండ్ల వద్ద, హోటల్స్‌లో వాడిన ఆయిల్‌నే మళ్లీ ఉపయోగించడం వల్ల నల్లగా, జిగురుగా తయారవుతుందని పేర్కొంటున్నారు. ఇలాంటి నూనెతో తయారుచేసిన పదార్థాలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు.ఒకసారి బాగా వేడిచేసిన నూనెను తర్వాత మళ్లీ వాడుకోవచ్చు. ఆ నూనెను మామూలుగా కూరల్లో వినియోగించడం వల్ల పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ, రెండు నుంచి మూడు సార్లు డీప్ ఫ్రై చేసిన నూనె చిక్కగా తయారవుతుంది. అప్పుడు ఆ నూనె ఎందుకూ పనికిరాదు. ఇలా వాడిన నూనె వాడడం వల్ల క్యాన్సర్స్ లాంటివి వచ్చే అవకాశం ఉంది. – డా. అంజలీ దేవి, పోషకాహార నిపుణులు

**ఏ నూనె మేలు :** కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ : గింజలను ఒత్తిడికి గురిచేసి తీసే(కోల్డ్ ప్రెస్డ్) నూనెకు ఎలాంటి రసాయనాలనూ కలపరని నిపుణులు చెబుతున్నారు. వేడి కూడా చేయరట. సహజ రుచి అలాగే ఉండటంతో పాటు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లూ ఉంటాయంటున్నారు.

**రిఫైన్డ్ ఆయిల్ :** గింజలను వేడి చేసి, తయారు చేసేవి రిఫైన్డ్ నూనెలు. స్పష్టంగా, ఆకర్షణీయంగా కనిపించటానికి నిల్వ ఉండటానికి రసాయనం కలుపుతారని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయని అంటున్నారు. ఈ క్రమంలో రిఫైన్ చేసేటప్పుడు ప్రమాదకర రసాయనాలు తొలగిపోతాయని వివరిస్తున్నారు. ఎలాగంటే, ఫంగస్‌తో కలుషితమైన వేరుశనగ గింజల్లో అఫ్లటాక్సిన్ అనే విష పదార్థం ఉండొచ్చని, ఇది తొలగిపోతుందని పేర్కొంటున్నారు.ఒకదాంట్లో మరో రకం నూనె కలిపి వాడటం మంచిదంటున్నారు నిపుణులు. వేరుశనగ నూనె, కొబ్బరినూనె, ఆవనూనె ఆరోగ్యానికి మేలట. ఇవి నెల నెలా మార్చి వాడుకోవడం లేదా ఒకదానికి ఒకటి కలిపి ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు. లేకుంటే, కొంత కోల్డ్ ప్రెస్డ్ నూనెకు నువ్వులు, వేరుశనగ, ఆవ నూనె వంటివి కలిపి వాడుకోవచ్చని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రిఫైన్డ్ ఆయిల్ కంటే కోల్డ్ ప్రెస్ ఆయిల్ వినియోగించడం మంచిదని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. అంతే కాకుండా నూనె ఎంత వాడాం అనేదాని కంటే నాణ్యత కూడా ముఖ్యమట.కనోలా నూనె, ఆలివ్ నూనె, వేరుశనగ నూనె, సోయాబీన్ నూనె, సన్ ఫ్లవర్ ఆయిల్స్ సాధారణంగా సురక్షితమైనవి.నూనె నుంచి పొగ రావడం మొదలైనా లేదా మంటలు అంటుకున్నా, దానిని ఉపయోగించవద్దు. నూనె దాని స్మోక్ పాయింట్‌కు చేరుకున్న తర్వాత క్షీణించడం మొదలవుతుంది.నూనె దుర్వాసన వస్తే, దాన్ని వాడకుండా పారేయండి. నూనెను ఎక్కువ కాలం నిల్వ ఉంచితే, అది ఆక్సీకరణం చెందవచ్చు లేదా పాడైపోవచ్చు.నూనెను తరచుగా ఉపయోగించకపోతే, చిన్న డబ్బాలలో కొనండి. ఇలా చేయడం వల్ల, గడువు ముగియక ముందే మీరు దానిని ఉపయోగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నూనెను చీకటిగా, చల్లగా ఉండే ప్రదేశంలో నిల్వ చేయండి.

# బీట్‌రూట్ జ్యూస్ కాలేయాన్ని డిటాక్స్ చేస్తుందా

**నిపుణులు ఏమంటున్నారో తెలుసా**

**బీట్‌రూట్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు!**

**మితంగా తీసుకోవాలని సూచన!!**



బీట్‌రూట్.. బెస్ట్ డైట్ అని చెప్పగానే వాటన్నింటిలో ముందు వరసలో కనిపిస్తుంది. ఈ ఐరన్ రిచ్‌ఫుడ్ తక్కువ సమయంలోనే హిమోగ్లోబిన్ శాతాన్నిపెంచడమే కాదు, శరీరానికి కావాల్సిన పోషకాలెన్నో అందిస్తుంది. కెంపు రంగులో మెరిసిపోయే ఈ దుంపతో కలిగే లాభాల్ని దృష్టిలో పెట్టుకునే రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటారు చాలామంది. ఈ క్రమంలో రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే కాలేయం డిటాక్స్ అవుతుందా? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!బీట్‌రూట్ జ్యూస్ కాలేయం పనితీరును మెరుగుపరచడంలో, దానిని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ప్రత్యేకమైన పోషకాలు కాలేయానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, కాలేయంలోని మలినాల్ని బయటకు పంపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు :** బీట్‌రూట్‌లో 'బీటాలైన్స్' పుష్కలంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కాలేయ కణాలను దెబ్బతీసి, వాటి పనితీరుకు ఆటంకం కలిగించే 'ఆక్సిడేటివ్ స్ట్రెస్'ను అడ్డుకోవడంలో ఈ యాంటీ ఆక్సిడెంట్లు కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు. అలాగే, బీటాలైన్స్ శరీరంలోని విషతుల్యాలను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచి, సహజమైన డీటాక్స్ ప్రక్రియకు తోడ్పడతాయని పేర్కొంటున్నారు. బీట్‌రూట్‌లు కాలేయం, మూత్రపిండాలను శుభ్రపరచడంలో చాలా శక్తివంతంగా పనిచేస్తాయని, ఇది రక్త ప్రసరణ వ్యవస్థను శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**బెటైన్ :** బీట్‌రూట్‌లో ఉండే 'బెటైన్' అనే సహజ సమ్మేళనం కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది శరీరంలో కొవ్వులు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది కాలేయంలో అధికంగా కొవ్వు పేరుకుపోకుండా అడ్డుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని అంటున్నారు. అంతేకాకుండా, కాలేయ కణాలను దెబ్బతినకుండా రక్షిస్తుందని తెలియజేస్తున్నారు. బీట్‌రూట్ జ్యూస్‌తో హెపాటిక్ స్టీటోసిస్ గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. పెద్దలలో నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ చికిత్సకు బీట్‌రూట్ జ్యూస్ ఒక ప్రభావవంతమైన మార్గమని సూచిస్తుంది.

**యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు :** దీర్ఘకాలిక వాపు కాలేయ దెబ్బతినడానికి కారణమవుతుందంటున్నారు నిపుణులు. బీట్‌రూట్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కాలేయంలోని వాపును తగ్గించి, దాని ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. ఇందులోని బీటాలైన్స్, నైట్రేట్లు వాపును తగ్గించడమే కాకుండా, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయని పేర్కొంటున్నారు. దీనివల్ల కాలేయానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు కణాల మరమ్మత్తు ప్రక్రియ వేగవంతం అవుతుందని వివరిస్తున్నారు.

**కాలేయ ఎంజైమ్ పనితీరు :** క్రమం తప్పకుండా బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల కాలేయ ఎంజైమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రక్తంలో అధిక స్థాయిలో ఉండే ఎంజైమ్‌లు కాలేయ ఒత్తిడికి సంకేతాలంటున్నారు. క్రమం తప్పకుండా బీట్‌రూట్ జ్యూస్ తీసుకోవడం వల్ల ఈ ఎంజైమ్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని, తద్వారా కాలేయ పనితీరు మెరుగుపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.బీట్‌రూట్ జ్యూస్ కాలేయానికి ఎంతో మేలు చేసినప్పటికీ, దానిని మితంగా తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అతిగా తీసుకోవడం వల్ల బీటూరియా (యూరిన్ గులాబీ లేదా ఎరుపు రంగులోకి మారడం) వంటి దుష్ప్రభావాలు కలగవచ్చని హెచ్చరిస్తున్నారు. బీట్‌రూట్‌లో ఆక్సలేట్లు ఎక్కువగా ఉండటం వల్ల కొంతమందికి కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. ఒకవేళ ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉంటే, బీట్‌రూట్ రసం తాగే ముందు సంబంధిత డాక్టర్‌ను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

# సింధూరం స్వచ్ఛమైనదో నకిలీదో గుర్తించేదెలా అసలు ఎలా తయారు చేస్తారంటే



కాదేదీ కల్తీకి అనర్హం అన్న సామెతను సార్థకం చేస్తూ దేశంలో అనేక వస్తువులు, నిత్యవసర వస్తువులు, తినే ఆహారం అన్నింటిలోనూ కల్తీకి తెగబడుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాలు, పెరుగు, జున్ను, పండ్లు, కూరగాయలు, ఉప్పు, పప్పు, వంటనూనెలు ఇలా ఒక్కటేమిటీ.. ఈ కలికాలంలో ప్రతిదీ కల్తీమయమే. అరటి, మామిడి, బొప్పాయి వంటి పండ్లు, తియ్యటి చక్కెరలో కెమికల్స్, బెల్లం రంగు, రుచి రావడం కోసం కూడా రసాయనాలు వాడుతున్నారు. చివరకు ఆడవాళ్లు నుదుటన ధరించే సింధూరంలోనూ కల్తీ ఉంటుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మార్కెట్లో నకిలీ సిందూరం దొరుకుతుండటంతో మహిళలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అసలు, నకిలీ సిందూరాలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి.

**1 / 5**

ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళు ్ళ చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే. ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే.

**2 / 5**

ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు. ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు.

**3 / 5**

అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది. అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది.

**4 / 5**

సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు. సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు.



# ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే మీ లైఫ్‌లో సరికొత్త చాప్టర్ మొదలైనట్లే



చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. కాబట్టి ఉదయం నిద్రలేచిన తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది.

**విషాన్ని తొలగిస్తుంది**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది.

**ఏపీ పీజీసెట్ 2025 దరఖాస్తు గడువు పెరిగిందోచ్..**

**ఎప్పటి వరకంటే?**

**జీవక్రియను పెంచుతుంది**

మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**చర్మ కాంతి పెరుగుతుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

**గమనిక:**

ఈ కంటెంట్ సాధారణ సమాచారం కోసం మాత్రమే. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

# రైతులకు గుడ్ న్యూస్.. పీఎం కిసాన్ 24వ విడత జమ అప్పుడే




రైతులు ఆర్థిక సాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా రైతులకు ఆర్థిక సాయం చేస్తోంది. సంవత్సరానికి రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 23 విడతలుగా రైతులకు డబ్బులు అందజేశారు. 23 విడతల్లో మొత్తం రూ.46 వేలను అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 23 విడత డబ్బులను ఈ ఏడాది జూన్‌లో జమ చేశారు. ఇప్పుడు 24వ విడతకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో 24వ విడత నిధులను కేంద్రం జమ చేసే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ పథకంలో భాగంగా ఎంత భూమి ఉన్న సంవత్సరానికి రూ.6 వేలు మాత్రమే చెల్లిస్తారు. అయితే ఈ పథకంలో భాగంగా అర్హులకు మాత్రమే నిధులు జమ చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వం ఉద్యోగం చేసి రిటైర్మెంట్ అయిన వారు, ఆదాయం పన్ను చెల్లిస్తున్నవారు ఈ పథకానికి అనర్హులు. కాగా ఈ పథకంలో రైతుకు పీఎం కిసాన్ నిధులు బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. లేకుంటే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావు. ఇప్పటికీ ఈకేవైసీ చేసుకోనివారు ఎవరైనా ఉంటే.. వెంటనే ఈకేవైసీ చేసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. రాగిని ఇప్పుడు కొనిపెట్టుకోండి..భవిష్యత్తులో వెండి ధరలను మించిపోతుందంటున్న నిపుణులు.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా రూ.6 వేలు ఇస్తున్నారు. అయితే పథకం మొదలైనప్పటి నుంచి రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. వీటిని రూ. 12 వేలకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019 ఇప్పటి వరకు చాలా సార్లు ఎరువుల ధరలు పెరిగాయని, కూలీ ధరలు భారీగా పెరిగాయని.. అందుకే ఈ పథకంలో చెల్లిస్తున్న మొత్తాన్ని పెంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఇటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కూడా రైతులకు ఆర్థిక సాయం చేస్తున్నాయి. ఏపీ అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఆర్థిక సాయం చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో అన్నదాతలకు ఆర్థిక సాయం చేస్తున్నాయి. ఈ పథకం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.12 వేలు రైతులు ఖాతాల్లో జమ చేస్తోంది. సంవత్సరానికి రెండు సీజన్లలో రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నారు. ఈ వర్షకాలం సీజన్ సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే రైతు రుణ మాఫీకి సంబంధించి రేవంత్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని రైతులు చెబుతున్నారు. చాలా మంది రైతులకు రుణ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రూ.22 వేల కోట్ల అప్పుకు 6, 203 కోట్లు కడితే చాలట



నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి దిగ్గజ సంస్థలకు ఏకంగా 99 శాతం నష్టాన్ని మిగుల్చుతూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును చాలా మంది తప్పుపడుతున్నారు. అప్పులు చెల్లించలేక దివాలా తీసిన జీ మీడియా అధినేత సుభాష్ చంద్రకు సంబంధించిన కేసులో ట్రిబ్యునల్ వెలువరించిన ఈ తీర్పు.. రుణదాతలను తీవ్రంగా నిరాశపరిచింది. మెజారిటీ క్రెడిటర్ల ఆమోదం ఉందనే కారణంతో కోట్లలో బాకీ ఉన్న కేసులో కేవలం లక్షల్లోనే రికవరీకి గ్రీన్ సిగ్నల్ లభించడం విస్మయానికి గురిచేస్తోన్నాయి. ఈ కేసుకు సంబంధించి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని అసమ్మతి క్రెడిటర్లు లేవనెత్తిన అభ్యంతరాలను ట్రిబ్యునల్ పట్టించుకోలేదు. తమకు రావాల్సిన రూ.వెయ్యి 322 కోట్ల 39 లక్షల బకాయికి బదులుగా కేవలం రూ.38లక్షలు చెల్లించాలనే ప్రతిపాదన చాలా చిన్నదని వాదనను నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ పట్టించుకోలేదు. అలాగే రూ.6 కోట్ల 50లక్షల పేఅవుట్ కూడా అంత స్పష్టంగా లేదని పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనను 80.81 శాతం ఓటింగ్ షేర్ కలిగిన మెజారిటీ క్రెడిటర్లు ఆమోదించారని, వ్యతిరేకించిన వారి వాటా 20 శాతం కంటే తక్కువేనని ఎన్సీఎల్‌టీ పేర్కొంది. రాగిని ఇప్పుడు కొనిపెట్టుకోండి..భవిష్యత్తులో వెండి ధరలను మించిపోతుందంటున్న నిపుణులు.. ఈ తీర్పుతో ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలకు ఊహించని భారీ నష్టం వాటిల్లింది. అసలు బాకీతో పోలిస్తే రూపాయిలో కనీస భాగం కూడా రాకపోవడంతో ఆ సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. అయితే వ్యక్తిగత ఆస్తుల విలువ చాలా తక్కువగా ఉందని, ప్రస్తుత ప్లాన్ ద్వారానే కొంతైనా రికవరీ జరిగే అవకాశం ఉందని రిజల్యూషన్ ప్రొఫెషనల్ నివేదిక వివరించింది. ఒకరి వ్యక్తిగత దివాలా ప్రక్రియ పరిష్కారమైతే, ప్రధాన రుణగ్రహీతల నుంచి బకాయిలు రాబట్టుకోవడానికి క్రెడిటర్లకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ట్రిబ్యునల్ తెలిపింది. క్రెడిటర్ల వాణిజ్యపరమైన నిర్ణయాలలో తాము జోక్యం చేసుకోలేమని, తమది కేవలం పర్యవేక్షణ, న్యాయపరమైన పాత్ర మాత్రమేనని తెలిపింది. ఎన్సీఎల్టీ తీర్పుపై సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు. సామాన్యుడు రూపాయి బాకీ ఉన్న ఆగం చేసే బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలు ఇప్పుడు ఏం చేస్తాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.22 వేల కోట్ల అప్పు ఉంటే అందులో 6.5 కోట్లు కట్టాలని తీర్పు చెప్పడం ఏమిటో దారిద్రం అని అంటున్నారు. ఇండియాలోనే ఈ దారిద్రం ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్సీఎల్టీ తీర్పుపై విజయ్ మాల్యా స్పందించారు. తాను చెల్లించాల్సిన రూ. 6వేల 203 కోట్ల అప్పు కంటే అధికంగా రూ.14వేల 100 కోట్లను వసూలు చేశారన్నారు. అంటే అప్పు కంటే డబుల్ పేమెంట్ బ్యాంకులు, ప్రభుత్వం రికవరీ చేసుకున్నాయని మాల్యా పేర్కొన్నారు. అయినప్పటికీ దేశంలో చాలామంది బకాయిదారులు మాత్రం తమ అప్పులను అతి తక్కువ భారాన్ని చెల్లించి సెటిల్ చేసుకుంటున్నారని, ఇదేనా భారతీయ రుణ పరిష్కార వ్యవస్థ అందించే న్యాయం అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# అన్ని సబ్జెకుల్లో ఫేయిల్.. ఇప్పుడు ఏరోస్పేస్ కంపనీ ఓనర్



పాఠశాలకు వెళ్లడానికి ప్రతిరోజూ దాదాపు ఆరు కిలోమీటర్లు నడిచే బాలుడు ఇప్పుడు భారతదేశ ఏరోస్పేస్ పారిశ్రామికవేత్తగా మారారు. ఆయనే ఆనంద్ మేఘలింగం. ఆయన పాఠశాల జీవితం అడ్డంకులతో నిండి ఉన్నప్పటికీ, కళాశాల జీవితం మరింత కష్టంగా మారింది. మొదటి సెమిస్టర్‌లో ఆనంద్ అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. ఒక్క పేపర్ కూడా పాస్ కాలేకపోయాడు. అయితే క్రీడలపై అతనికున్న ప్రేమ మరో మార్గాన్ని చూపింది. అది అతనికి ఒక ప్రైవేట్ కళాశాలలో ప్రవేశం పొందడానికి ఉపయోగపడింది. అక్కడ అతను ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. ఆ సబ్జెక్టు అతని జీవిత గమనాన్ని మార్చివేసింది. అతను పోటీలలో పాల్గొని, బహుమతులు గెలుచుకొని, ఏరోస్పేస్ రంగమే తన గమ్యం అనే దృఢ విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. ఆ దృఢ విశ్వాసమే చివరికి అతన్ని డిసెంబర్ 2021లో స్పేస్ జోన్ ఇండియాను స్థాపించడానికి దారితీసింది. ప్రస్తుతం ఈ సంస్థ ప్రైవేట్ అంతరిక్ష యాత్రలు, పునర్వినియోగ రాకెట్ సాంకేతికతపై పనిచేస్తోంది. దీని విలువ దాదాపు 800 కోట్లుగా తెలిసింది. ఖర్చులను తగ్గించడం, మరింత సుస్థిరమైన అంతరిక్ష యాత్రలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశపు మొట్టమొదటి పునర్వినియోగ రాకెట్ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. తన తండ్రిని సహ-వ్యవస్థాపకుడిగా చేర్చుకుని, కంపెనీలో అతనికి 50 శాతం వాటాను ఇచ్చారు. భారతదేశపు మొట్టమొదటి హైబ్రిడ్ రాకెట్ డైరెక్టర్"గా అభివర్ణించుకున్నారు ఆనంద్. రాగిని ఇప్పుడు కొనిపెట్టుకోండి..భవిష్యత్తులో వెండి ధరలను మించిపోతుందంటున్న నిపుణులు.. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆనంద్ మేఘలింగం. పరిమిత వనరులున్న ఇంట్లో పెరిగారు. ఆయన తండ్రి కుటుంబాన్ని పోషించడానికి ట్రాక్టర్ నడిపేవారు. పాఠశాల విద్య తర్వాత, ఆనంద్ మొదట కంప్యూటర్ సైన్స్‌ను ఎంచుకున్నారు. అది తనకు స్థిరమైన వృత్తిని అందిస్తుందని నమ్మారు. కానీ ఆ కోర్సు అతనికి ఆసక్తిని కలిగించలేదు. చదువులో ఫేయిల్ అయ్యాడు. చివరికి అతను చదువు మానేశాడు. ఈ ఎదురుదెబ్బ, తాను ఏమి చదవాలనుకుంటున్నాడో పునరాలోచించుకునేలా అతన్ని ప్రేరేపించింది. అతను ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నారు. ఇది విమానయానం, అంతరిక్ష సాంకేతికతపై ఆయన ఆసక్తికి మరింత పెంచింది. ఆనంద్, భరత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి 9.8 బంగారు పతక విజేతగా కోర్సును పూర్తి చేశారు. తద్వారా తన విఫలమైన ఆరంభాన్ని ఒక విద్యా విజయంగా మార్చుకుని, ఏరోస్పేస్‌ను వృత్తిపరంగా కొనసాగించడానికి అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని పొందారు. భారతదేశ అంతరిక్ష ఆశయాలలో ప్రైవేట్ కంపెనీలు మరింత పెద్ద పాత్ర పోషించగలవనే ఆలోచనతో ఆనంద్ స్పేస్ జోన్ ఇండియాను స్థాపించారు. -1 పై పని జనవరి 2023లో ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్ పరిమిత నిధులు, సాంకేతిక ఎదురుదెబ్బలు, నియంత్రణ సవాళ్లను ఎదుర్కొంది. తొలి నమూనాలు పనిచేయకపోవడంతో బృందం ఆ వ్యవస్థను పదేపదే పరీక్షించి, సవరించవలసి వచ్చింది. చివరకు 2024 ఆగస్టు 24న తమిళనాడులోని తిరువిదన్‌దైలో ప్రయోగం జరిగింది. ఇగ్నిషన్ బటన్ నొక్కిన తర్వాత నాలుగు సెకన్ల పాటు వేచి ఉన్నట్లు ఆనంద్ గుర్తుచేసుకున్నారు. చివరకు 1 ఒక మొబైల్ లాంచ్ ప్లాట్‌ఫామ్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఘన ఇంధనం, ద్రవ ఆక్సిడైజర్‌తో పనిచేసే ఈ హైబ్రిడ్ రాకెట్, వాతావరణ మరియు శీతోష్ణస్థితి పరిశోధనల కోసం మూడు క్యూబ్‌శాట్‌లు మరియు 50 పికో ఉపగ్రహాలను మోసుకెళ్తూ ఉపకక్ష్య అంతరిక్షంలోకి ప్రవేశించిందని ఆ సంస్థ తెలిపింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# జియో రూ.200 ప్లాన్ లో అదిరిపోయే ఫీచర్లు.. ఓటీటీలు, లైవ్ టీవీ




జియో అదరిపోయే ఆఫర్ ప్రకటించింది. కేవలం రూ.200 ప్లాన్ మీకు బెస్ట్ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ 28 రోజుల వ్యాలిడిటీతో రానుంది. ఈ ప్లాన్ లో భాగంగా మొత్తం 30+ హై-స్పీడ్ డేటాను వస్తుంది. అలాగే అనేక ాు ప్లాట్‌ఫారమ్‌లు, జియోటీవీకి కూడా యాక్సెస్ చేసుకోవచ్చు. జియో రూ.200 ప్లాన్ లో 30+దీ డేటాను వాడుకోవచ్చు వినియోగదారులు ఈ డేటాను ప్లాన్ వ్యాలిడిటీ కాలం మొత్తం తమ అవసరాలకు అనుగుణంగా వాడుకోవచ్చు. అయితే 30 దీ హై-స్పీడ్ డేటా అయిపోయిన తర్వాత ఇంటర్నెట్ వేగం 64తగ్గిపోనుంది. అలాగే ఈ ప్లాన్‌లో ప్రత్యేకంగా అపరిమిత వాయిస్ కాలింగ్ ఉండదు. అలాగే ఉచిత ఎస్ఎంఎస్ లు కూడా రావు. ఈ ప్లాన్ కేవలం డేటా, ఓటీటీల కోసమే మాత్రమేనని గమనించాలి.ఈ ప్లాన్ లో భాగంగా అనేక ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. జియో రూ.200 రిఛార్జ్‌లో యూట్యూబ్ ప్రీమియం, ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్, జియోహాట్‌స్టార్, సోనీ 5, లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీం, సన్ చీఞ, కంచ లంకా, ఞుఎఔఱఅ, చౌపాల్, హోయిచోయ్, ఫ్యాన్‌కోడ్, టైమ్స్ ప్లే, తరంగ్ ప్లస్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు ఉచితంగా వాడుకోవచ్చు. ఈ ప్లాన్లో జియోటీవీ ద్వారా 1,000కు పైగా లైవ్ టీవీ ఛానెళ్లను కూడా లైవ్ లో చూడవచ్చు. ఈ ప్లాన్‌లో సోనీ, సన్ టీవీ, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, ఈటీవీ వంటి అనేక నెట్‌వర్క్‌ల ఛానళ్లు ఉన్నాయి. అయితే ఈ ప్రయోజనంలో స్పోర్ట్స్ ఛానళ్లు లేవని గమనించాలి. రాగిని ఇప్పుడు కొనిపెట్టుకోండి..భవిష్యత్తులో వెండి ధరలను మించిపోతుందంటున్న నిపుణులు.. జియో రూ.200 ప్లాన్‌లో సినీపోలిస్ టిక్కెట్లపై రూ.150 వరకు తగ్గింపు విస్తుంది. కనీసం రూ.550 బుకింగ్, రెండు టిక్కెట్లపై ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని జియో పేర్కొంది. మీకు ఆహారం, పానీయాలపై 10 శాతం తగ్గింపు రానుంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే..ఈ ఆఫర్ మంగళవారం నాడు చెల్లుబాటు కాదని గుర్తుంచుకోవాలి. ఈ ప్లాన్‌కు కూడా ట్రూ 5+ ట్యాగ్ ఉన్నప్పటికీ, అపరిమిత 5+ డేటాను పొందాలంటే మీకు రోజుకు 1+దీ లేదా 1.5+దీ డేటా ఉన్న బేస్ ప్లాన్ రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూ చనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

## లంకపై టెస్ట్ సిరీస్ గెలిచినా డబ్ల్యూటీసీలో టీమిండియా స్థానం అదే



శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, ఈ విజయం టీమిండియాకు పూర్తిస్థాయి ఆనందాన్ని ఇవ్వలేకపోయింది. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఈ డ్రా కారణంగా విలువైన పాయింట్లు కోల్పోయిన శుభ్‌మన్ గిల్ సేన, పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే నిలిచిపోయింది. సిరీస్ గెలిచినప్పటికీ, పట్టికలో పురోగతి సాధించలేకపోవడం జట్టును నిరాశపరిచింది.రెండో టెస్టు ప్రారంభానికి ముందు 53.33 పాయింట్ల శాతంతో (పీసీటీ) ఉన్న భారత్, ఈ డ్రా ఫలితంతో 51.52 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో 2023 విజేత ఆస్ట్రేలియా (80%), 2025 విజేత దక్షిణాఫ్రికా (75%), 2021 ఛాంపియన్ న్యూజిలాండ్ (72.22%), బంగ్లాదేశ్ (55.56%) తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. వారి తర్వాత భారత్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు, ఈ మ్యాచ్‌ను విజయవంతంగా డ్రా చేసుకున్న శ్రీలంక 33.33 పీసీటీతో ఆరో స్థానంలో ఉంది.ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన రెండో టెస్టులో చివరి రోజు భారత్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, శ్రీలంక బ్యాటర్ సోనల్ దినుష (133 నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమతో వీరోచిత శతకం బాది టీమిండియా ఆశలపై నీళ్లు చల్లాడు. 16 పరుగుల స్వల్ప ఆధిక్యంతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన లంక, తొలి సెషన్‌లోనే వికెట్ నష్టపోకుండా 100 పరుగులు జోడించింది. దినుషకు కేశర నువంత (46) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు.భోజన విరామం తర్వాత మానవ్ సుతార్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టినా, క్రీజులో పాతుకుపోయిన దినుష పట్టు వదల్లేదు. లహిరు కుమారతో కలిసి మ్యాచ్‌ను డ్రా దిశగా నడిపించాడు. భారత బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ వంటి పార్ట్‌టైమ్ బౌలర్లు బౌలింగ్ చేశారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చివరకు ఇరుజట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు.ఇప్పటికే తమ డబ్ల్యూటీసీ సైకిల్‌లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌తో సిరీస్‌లు పూర్తి చేసుకున్న భారత్‌కు రాబోయే సిరీస్‌లు అత్యంత కీలకం కానున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి గడ్డపై రెండు టెస్టులు, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌లలో అసాధారణ ఆటతీరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం టీమిండియాకు తప్పనిసరి.

## శ్రీలంకతో రెండో టెస్టు డ్రా.. టెస్ట్ క్రికెట్ గెలిచిందన్న టీమిండియా కెప్టెన్ గిల్




భారత్, శ్రీలంక మధ్య కొలంబోలో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఖరి రోజు భారత బౌలర్లను లంక బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా, సోనల్ దినుష (133 నాటౌట్) అజేయ సెంచరీతో వీరోచితంగా పోరాడి మ్యాచ్‌ను కాపాడాడు. రెండో టెస్టు డ్రా అయినప్పటికీ, రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. క్లీన్‌స్వీప్ చేయాలన్న టీమిండియా ఆశలు నెరవేరలేదు.మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ వ్యూహాల్లో ఎలాంటి పొరపాటు లేదని స్పష్టం చేశాడు. "నిజాయతీగా చెప్పాలంటే, మేం చేయగలిగిందంతా చేశాం. మూడు రోజుల పాటు ఫీల్డింగ్ చేశాం. కానీ లంక బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వారికి కొద్దిగా అదృష్టం కూడా కలిసొచ్చింది" అని గిల్ అన్నాడు. ఫాలో-ఆన్ నిర్ణయంపై మాట్లాడుతూ.. "జరిగిపోయిన తర్వాత దేని గురించైనా మాట్లాడొచ్చు. కానీ ఆ క్షణంలో ఏది ఉత్తమమనిపిస్తుందో ఆ నిర్ణయమే తీసుకుంటాం. ఈరోజు టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని వ్యాఖ్యానించాడు.ఈ సిరీస్‌లో తమకు ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని గిల్ తెలిపాడు. దేవ్‌దత్ పడిక్కల్, కేఎల్ రాహుల్, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించారని ప్రశంసించాడు. ముఖ్యంగా, సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. "అతని బౌలింగ్‌లో స్థిరత్వం, బంతిని రిలీజ్ చేసే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భవిష్యత్తులో అతను మాకు కీలక బౌలర్ కాబోతున్నాడు" అని గిల్ వివరించాడు.రాబోయే అంతర్జాతీయ మ్యాచ్‌ల గురించి మాట్లాడుతూ.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడమే తమ లక్ష్యమని గిల్ స్పష్టం చేశాడు. "మైదానంలోనూ, వెలుపల మా ప్రదర్శన, సన్నద్ధతలో స్థిరత్వం చాలా ముఖ్యం. త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళుతున్నాం. ఆ తర్వాత స్వదేశంలో మంచి సిరీస్‌లు ఉన్నాయి. మాపై మాకు నమ్మకం ఉంది, కచ్చితంగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకుంటాం" అని ధీమా వ్యక్తం చేశాడు.

## భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష.. రెండో టెస్టు డ్రా.. గిల్ సేనదే సిరీస్



శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి ఖాయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి.మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు.ఫాలో ఆన్‌లో లంక పోరాటం ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు. పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు.భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.


# డిసెంబరులో లెగసీ



డిసెంబరులో విశ్వక్ సేన్ 'లెగసీ' థియేటర్స్‌కి రానుంది. విశ్వక్ సేన్ హీరోగా సాయి కిరణ్ దైదా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లెగసీ'. ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్న్?తన్నారు. యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కొత్త షెడ్యూల్ మదనపల్లె పరిసర ప్రాంతాల్లో గురువారం ప్రారంభమైంది. విశ్వక్ సేన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. "మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో నెల రోజుల షెడ్యూల్ ప్లాన్ చేశాం. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం అంశాలతో సాగే ఈ కథలో ఒక వారసుడు ప్రమాదకరమైన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. అతను తన తండ్రి గతానికి సంబంధించి దాగి ఉన్న నిజాలను ఎదుర్కొంటూ, శక్తివంతమైన ప్రత్యర్థులతో పోరాడుతూ తనపై పడిన వారసత్వపు భారాన్ని మోసే పరిస్థితిని ఎలా ఎదుర్కొన్నాడు? అన్నదే ఈ సినిమా కథనం" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత.

# దసరా కానుకగా 'రణబాలి'

1854–1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న పీరియాడిక్ పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. వివాహానంతరం అగ్ర కథానాయకుడు దేవరకొండ విజయ్, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం విడుదల తేదీని గురువారం మేకర్స్ ప్రకటించారు. విజయదశమి కానుకగా అక్టోబర్ 16న 'రణబాలి' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో విజయ్ దేవరకొండ చేతిలో కత్తితో ఫెరోషియస్‌గా కనిపిస్తున్నారు. ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి రచన: ప్రమోద్ తమ్మినేని, కెమెరా: నీరవ్ షా, జిష్ణు భట్టాచర్జీ, సంగీతం: అజయ్–అతుల్, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిల్మ్స్.



# ఫోర్బ్స్ కవర్‌పై అల్లు అర్జున్..




## అరుదైన ఘనత దక్కించుకున్న టాలీవుడ్ యువ హీరో

## వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100మందిలో బన్నీ

'పుష్ప' ఫ్రాంఛైజీతో దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ మరో అరుదైన ఘనతను సాధించారు. భారతదేశంలో వివిధరంగాల్లో ప్రభావం చూపిన 100మంది సెలబ్రిటీలతో రూపొందించిన ఫోర్బ్స్ ఇండియా 'షో స్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్‌పేజీపై ఆయన చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ 'సినిమా విజయానికి కథే ప్రధానం. ఏ భాషా చిత్రానికైనా అదే సూత్రం వర్తిస్తుంది. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారు. ఆర్టిస్టుల స్టార్‌డమ్, ఇమేజ్ కంటే కథలో కొత్తదనం సినిమా విజయాన్ని నిర్ణయిస్తుంది' అని అల్లు అర్జున్ అభిప్రాయపడ్డారు. ఫోర్బ్స్ ఇండియా ప్రతీ ఏటా విడుదల చేసే ఈ జాబితాలో ఈసారి అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్‌బచ్చన్, మోహన్‌లాల్, రజనీకాంత్, రామ్‌చరణ్, షారుఖ్‌ఖాన్, అమీర్‌ఖాన్, అక్షయ్‌కుమార్, ఏఆర్ రెహమాన్, దుల్కర్ సల్మాన్, రణ్‌వీర్‌సింగ్, రిషబ్‌శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనారనౌత్ తదితరులు ఉన్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

# ఇమేజ్ ను పక్కనబెడితే కనక వర్షమే!

ఒకప్పుడు సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే భారీ బడ్జెట్లు, వందల కోట్ల వ్యయంతో కూడిన విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ హీరోల ఇమేజ్ మాత్రమే సరిపోతాయని భావించేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ ప్రేక్షకుల అభిరు చి కూడా మారుతోంది. ప్రస్తుతం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి భారీ హంగులు మాత్రమే సరిపోవని, తెరపై కనిపించే కథలో బలం ఉండాలని చిత్ర పరిశ్రమ స్పష్టంగా గ్రహిస్తోంది. ఈ కొత్త ట్రెండ్‌కు నిదర్శనంగా ఇటీవలి కాలంలో వచ్చిన అనేక సినిమాలు నిలుస్తున్నాయి. స్టార్ ఇమేజ్‌ను నమ్ముకోకుండా విభిన్నమైన కథాంశాలతో వస్తోన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద భారీ ఆదరణ లభిస్తోంది.



సమంత ప్రధాన పాత్రలో రిలీజ్ అయిన –మా ఇంటి



బంగారం–, అఖిల్ అక్కినేని నటించి –లెనిన్–, మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన –కొరియన్ కనకరాజు–, మాస్ మహారాజా రవితేజ తాజా చిత్రం –ఇరుముడి– వంటి ప్రాజెక్ట్‌లు కొత్త కోణానికి అద్దం పడుతున్నాయి. ఈ చిత్రాలన్నీ సాధారణ ఇమేజ్ హంగులకు దూరంగా పూర్తిగా కంటెంట్ ... పాత్రల చుట్టూ తిరిగే కథాంశాలతో రూపుదిద్దుకున్నాయి. స్టార్ హీరోల ఇమేజ్, భారీ మార్కెట్ సమీకరణాలను పక్కన పెట్టి దర్శకుని విజన్‌ను నమ్మి చేసిన చిత్రాలివి. ప్రేక్షకులు కూడా రొటీన్ కమర్షియల్ ఫార్ములాను పక్కన పెట్టి కొత్తదనం ఉన్న కథలను ఎప్పుడూ ఆదరిస్తారని ఈ చిత్రాల ఫలితాలో మరోసారి నిరూపితమవుతోంది.ఇతర భాషల ప్రేక్షకులు సైతం బలమైన కంటెంట్ ఉన్న తెలుగు చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. భాషా భేదాలతో సంబంధం లేకుండా ఎమోషనల్ కనెక్ట్ ఉన్న సినిమాలను గ్లోబల్ ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటున్న తీరు అద్భుతంగా ఉంది. దీంతో నిర్మాతలు కూడా భారీ బడ్జెట్ రిస్క్‌ల కంటే కంటెంట్ బేస్డ్ సినిమాల వైపు మొగ్గు చూపడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇది తెలుగు పరిశ్రమ పరిధిని మరింత విస్తృతం చేస్తోంది.నటీనటులు కూడా రెగ్యులర్ ఇమేజ్ ట్రాప్ నుంచి బయటపడి విలక్షణమైన పాత్రలు చేయడానికి ఈ ట్రెండ్ ఎంతగానో దోహదపడుతోంది. ప్రయోగాత్మక చిత్రాలు సైతం కమర్షియల్‌గా మంచి విజయాలను నమోదు చేయొచ్చు ని నిరూపితమవుతుండటంతో దర్శక నిర్మాతల్లో కొత్త ఉత్సాహం వెల్లువెత్తుతోంది. భవిష్యత్ లో కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల హవా మరింత ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి ఇమేజ్ కంటే కంటెంటే రాజు అనే నిజాన్ని టాలీవుడ్ మరోసారి బలంగా చాటి చెబుతోంది.భారీ బడ్జెట్ల ప్రయోగాలు విఫలమైన చోట బలమైన కథాంశాలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఈ సరికొత్త ధోరణి ఇండియన్ సినిమా స్థాయిని మరింత పెంచి భవిష్యత్తులో మరిన్ని గొప్ప చిత్రాలు రావడానికి బాటలు వేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



మృణాల్ ఠాకూర్ ఆకర్షణీయమైన ఎరుపు రంగు క్రాప్ టాప్ మరియు గులాబీ రంగు స్కర్ట్‌లో

I PRINTED, PUBLISHED & OWNED By M.SUNIL KUMAR at printed at Global printers #10 MIE Industrial Estate,Kallur,kurnool,Andhrapradesh.
Published from Hno: 4-86-1 New postal Colony,Balaji nagar,Kurnool,Andhrapradesh- 518003.EDITOR : M.sunil kumar, #1/339/17, sree ram nagar, bharpet,near nobel college ,ramjal road Adoni kurnool district- 518301 Andhra Pradesh. E-mail: Suryaudhayamdaily@gmail.com